జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు

# క్యాబినెట్ ఆమోదం

- ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఇ-క్యాబినెట్ సమావేశం

**అమరావతి, మహానాడు:**

రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం వివరాలను సచివాలయం నాలుగో భవనం ప్రచార విభాగంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర జల వనరులు, సాంఘిక సంక్షేమం, హోం, పర్యాటక శాఖల మంత్రులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, కందుల దుర్గేశ్ లు వివరించారు.

సమాజంలో వివిధ ఉప కులాల మధ్య ఏకీకృత, సమానమైన పురోగతి షెడ్యూల్డ్ కులాల మధ్య ఉప-వర్గీకరణను అమలు చేయటానికి సాంఘిక సంక్షేమ శాఖ చేసిన ముసాయిదా ఆర్డినెన్స్ కోసం రాష్ట్రంలో ప్రతిపాదనకు రాష్ట్ర మండలి ఆమోదించింది.

రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణను అమలు చేయడానికి చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించింది. సమాజంలో అన్ని షెడ్యూల్డ్ కులాల వర్గాల ఏకీకృత, సమాన ప్రగతిని నిర్ధారించడమే ఈ ఆర్డినెన్స్ ముఖ్య ఉద్దేశ్యంగా సమావేశం పేర్కొంది. రాష్ట్రంలోని 59 షెడ్యూల్డ్ కులాలను జనాభా, వెనుకబాటుతనం, సామాజిక సమైక్యతల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించారు. ఈ మూడు కేటగిరీలకు రిజర్వేషన్ల శాతం ఈ విధంగా నిర్ణయించారు.

- గ్రూప్-I (12 కులాలు): 1% రిజర్వేషన్: బవురి, చచాటి, చండాల, దండాసి, డొమ్, ఘాసి, గొడగలి, మెహతర్, పాకి, పామిడి, రెల్లి, సాప్రు
- గ్రూప్-I (18 కులాలు): 6.5% రిజర్వేషన్: అరుంధతీయ, బిందల, చమార్, చంభార్, దక్కల్, ధోర్, గొదారి, గోసంగి, జగ్గాలి, జంబువులు, కొలుపులవండ్లు, మాదిగ, మాదిగ దాసు, మాంగ్, మాంగ్ గరోడి, మాతంగి, సమగార, సింధోలు.
- గ్రూప్-III (29 కులాలు): 7.5% రిజర్వేషన్ : ఆది ద్రావిడ, అనముక్, అరయ మాల, అర్వ మాల, బారికి, బ్యాగర, చలవాది, ఎల్లమలవార్, హొలేయ, హొలేయ దాసరి, మదాసి కురువ, మహర్, మాల, మాల దాసరి, మాల దాసు, మాల హన్నాయి, మాలజంగం, మాల మస్తి, మాల సాలె, మాల సన్యాసి, మన్నే, ముండల, సంబన్, యాతల, వల్లువన్, ఆది ఆంధ్ర, మస్తి, మిట్టా అయ్యలవార్, పంచమ

ఈ ఉపవర్గీకరణ కోసం 200 పాయింట్ల రోస్టర్ వ్యవస్థను అనుసరిస్తారు. ఇది రెండు సైకిల్స్ లో (ఒక్కొక్కటి 1-100 వరకు) పనిచేస్తుంది. ఈ ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని షెడ్యూల్డ్ కులాల వర్గాలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో సమాన, న్యాయమైన ప్రవేశం లభిస్తుందని,

మిగతా.. 2లో

**అన్నా.. హన్నన్నా**







## ఒక కొణిదెల అన్నా.. ఒక వైఎస్ జగన్..

# ఒక తిరుమల డిక్లరేషన్

- క్రైస్తవురాలయిన పవన్ భార్య టీటీడీకి డిక్లరేషన్ ఇచ్చిన వైనం
- తనకు హిందూ ధర్మంపై విశ్వాసం ఉందంటూ డిక్లరేషన్
- కొండపైకి వెళ్లి గుండుకొట్టించుకున్న అన్నా కొణిదెల
- స్వయంగా భక్తులకు భోజనం వడ్డించిన పవన్ భార్య
- భక్తులతో కలసి సహపంక్తిభోజనం
- అన్నదాన పథకానికి 17 లక్షల విరాళం
- నీరాజనం పట్టిన హిందూ సమాజం
- తన మనుమడి ప్రతి పుట్టినరోజున అన్నదానికిబాబు భారీ విరాళం
- ఇంతవరకూ నయాపైసా విరాళం ఇవ్వని జగన్
- ఇప్పటిదాకా టీటీడీకి డిక్లరేషన్ ఇవ్వని జగన్
- డిక్లరేషన్ ఇవ్వకుండానే దైవదర్శనం
- జగన్ క్రైస్తవుడని తెలిసినా డిక్లరేషన్ అడగని ధర్మారెడ్డి
- అడ్డు చెప్పని భూమన, వైవి సుబ్బారెడ్డి
- ఒక్కసారి కూడా తిరుమలకు రాని జగన్ భార్య భారతీరెడ్డి
- సర్కారు సొమ్ముతో సెట్ వేసుకున్న వైచిత్రి
- అన్నా పవన్ క్రైస్తవురాలయినా స్వచ్ఛంద డిక్లరేషన్
- రష్యన్‌ను చూసి హిందూ ధర్మం నేర్చుకోమంటూ వ్యాఖ్యలు
- అన్నానే అసలైన క్రైస్తవురాలంటూ సోషల్‌మీడియాలో పోస్టులు

- అన్నా-జగన్‌ను పోల్చుతూ జగన్‌పై విరుచుకుపడుతున్న హైందవ సమాజం

**మహానాడు ఫోకస్**

**(మార్తి సుబ్రహ్మణ్యం)**

ఆమె పేరు కొణిదెల అన్నా. స్వతహాగా రష్యన్ దేశస్తురాలు. అంతకుమించి క్రైస్తవురాలు. దానికితోడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భార్య. సింగపూర్ స్కూల్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి తనకు కొడుకును రక్షించినందుకు కృతజ్ఞతగా ఆమె తిరుమల వెళ్లారు. తాను క్రైస్తవురాలు, పైగా పవన్ భార్య అయినందున.. మాజీ సీఎం జగన్ మాదిరిగా, డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం లేదను కోలేదు. స్వయంగా ఆమెనే టీటీడీ అధికారులను అడిగి డిక్లరేషన్ బుక్ తెప్పించి.. తనకు హిందూ మత విశ్వాసాలపై అపారమైన విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇచ్చారు. అంతేనా? తన మొక్కు తీర్చుకునేందుకు ప్రేమతో పెంచుకున్న జుట్టు తీయించుకున్నారు. అక్కడి నుంచి అన్నదాన సత్రానికి వెళ్లి, భక్తులకు వడ్డించి, తాను కూడా వారితో సహపంక్తి భోజనం చేశారు. అన్నదాన పథకానికి 17 లక్షల విరాళం ఇచ్చారు.

- ఇదీ తిరుమల కొండపై కోట్లాదిమంది భక్తులు దర్శించిన ఒక అసాధారణ దృశ్యం. చాలామంది అన్యమతస్తులు డిక్లరేషన్‌పై సంతకం చేసినా, ఎవరూ గుండు కొట్టించుకోరు. కానీ.. పవన్ భార్య అన్నా అందుకు భిన్నంగా తలనీలాలర్పించి, తన భర్త చెప్పే సనాతన ధర్మాన్ని గౌరవించారు.

సీన్ కట్ చేస్తే.. క్రైస్తవుడైన వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చాలాసార్లు తిరుమలకు వెళ్లారు. కానీ ఒక్కసారి కూడా తనకు హిందూ మత విశ్వాసాలపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇవ్వలేదు. పైగా ఎందుకు ఇవ్వాలని ఎదురుదాడి చేశారు. అప్పట్లోజెఈఓగా ఉన్న ధర్మారెడ్డిగానీ, చైర్మన్లుగా పనిచేసిన భూమన కరుణాకర్‌రెడ్డి, వైవి సుబ్బారెడ్డిగానీ ఆయనతో సంతకం చేయించే ధైర్యం చేయలేదు. జగన్ మతం మారిన క్రైస్తవుడన్న విషయం బహిరంగమే. ఆయన కుటుంబంలో జరిగే అన్ని కార్యక్రమాలు క్రైస్తవ ఆచారాల మేరకే

మిగతా.. 2లో

3 లో





# మీరంతా విజేతలు..

## మిమ్మల్ని చూసి గర్వపడుతున్నా!

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



# నిజాయితీ.. నిబద్ధతతోనే రాజకీయాలు చేస్తా

- నన్ను నమ్మినంత కాలం నమ్మండి
- అనుమానం వచ్చిన రోజు నన్ను నమ్మడం మానేయండి
- కులాల పిచ్చి, రాజకీయ పిచ్చి నుంచి బయట పడాలి
- నేను వెళ్తే సీఎస్ ముఖం కూడా చూపించలేదు
- నేను దేన్నీ వదిలిపెట్టను.. ఎవర్నీ వదిలిపెట్టను
- కుల గుర్తింపు ఇంటి వరకే పరిమితం కావాలి
- మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు

10 లో..

సహజంగా ఏ రాజకీయ నాయకుడైనా తానిచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాజీనామా చేస్తానంటారు. లేకపోతే అందుకు ఎదుటి పార్టీ వారే కారణమని నిందిస్తారు. కానీ.. నన్ను నమ్మినంతకాలం నమ్మండి. అనుమానం వచ్చినరోజు నమ్మడం మానేయడంటూ చెప్పిన తొలి రాజకీయనాయకుడు కొత్తగా తెరంగేట్రం చేశారు. 'నేను నిజాయితీతో కూడిన రాజకీయాలే చేస్తా. ఆ మేరకు నా అడుగులు చూసి, నన్ను నమ్మినంతకాలం నమ్మండి. అనుమానం వచ్చిన రోజు నన్ను నమ్మడం మానేయండి"అని విభిన్నంగా వ్యాఖ్యానించారు మాజీ డీజీపీ, తాజాగా రాజకీయ అరంగేట్రం చేసిన ఏబీ వెంకటేశ్వరరావు! తాను నమ్మిన సిద్ధాంతం, నిజం కోసం ఎంతదూరమైనా వెళతానన్నారు. ఎవరినీ వదిలిపెట్టను. దేనినీ వదిలిపెట్టనంటున్న ఏబీవీ.. ఏపీలో పెరుగుతున్న కులపిచ్చి, కులాంతర వివాహాలు, విద్వేష రాజకీయాలు, జగన్‌పై తన యుద్ధవ్యూహం, సర్వీసులో ఉండగా తన వృత్తిపరమైన అనుభవాలు, తీపి-చేదు ఘటనలను 'విజిల్' డిజిటల్ చానెల్‌తో పంచుకున్నారు. ”

## తెలంగాణ పథకాలతో

# మోదీ ఉక్కిరి బిక్కిరి

- కులగణన మోదీకి మరణశాసనం
- వర్గీకరణ మోదీకి గుదిబండ
- మే 1 నుంచి జూన్ 2 వరకు నేనూ జనంలో ఉంటా
- మీరూ రేపటి నుంచి జనంలో ఉండాలి.
- బీజేపీ, బీఆరెస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం
- భూ భారతిని రైతులకు చేరవేయాలి
- సన్నబియ్యం పథకం ఒక అద్భుతం
- సన్న బియ్యం మన పథకం..మన పేటెంట్, మన బ్రాండ్
- సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .
- శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం
- హాజరైన పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రులు,ఎమ్మెల్సీ లు ఎమ్మెల్యేలు,ఎంపీలు



**హైదరాబాద్:** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సన్నబియ్యం పథకం ఒక అద్భుతం. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకం.

భూ భారతిని రైతులకు చేరవేయాలి. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచింది.

మిగతా.. 2లో



- బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం
- బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్
- బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# నేను కొంచెం రౌడీ టైప్

**బాన్సువాడ:** కేసీఆర్ సార్ మంచోడు కావచ్చు. నేను కొంచెం రౌడీ టైప్. ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టేది లేదు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది.ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం. బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదు. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ.

మాట తప్పడమే... మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ,

మిగతా.. 2లో



## కేంద్ర గిరిజన వర్సిటీ నిర్మాణ పూర్తికి

# సహకారం అందిస్తాం

- సీఎం చంద్రబాబు

**అమరావతి, మహానాడు:**

విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలసలో నిర్మాణమవుతున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం సత్వర పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ టీ.వీ. కట్టిమణి, డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్ సీఎం చంద్రబాబును మంగళవారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ నిర్మాణ పనులు, అక్కడి స్థితిగతులపై వారితో సీఎం చంద్రబాబు మాట్లాడారు.

గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేంద్రం రూ.800 కోట్లు కేటాయించగా, వాటిలో రూ.340 కోట్లు ఇప్పటికే విడుదల అయ్యాయి. మొత్తం 561 ఎకరాల వర్సిటీ ప్రాంగణంలో

మిగతా.. 2లో



## సోనియా, రాహుల్ గాంధీపై

# ఈడీ ఛార్జిషీట్

- కాంగ్రెస్‌కు ఎన్డీఏ ఝలక్

**న్యూఢిల్లీ,మహానాడు:**

నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించింది. అలాగే, సీనియర్ కాంగ్రెస్ నేత శామ్

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 16, ఏప్రిల్ 2025 ‖

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు
# క్యాబినెట్ ఆమోదం

**మొదటి పేజీ తరువాయి..**

దీని ద్వారా రాజ్యాంగ లక్ష్యాలను సాధించి సామూహిక అభివృద్ధిని నిర్ధారించగలమని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ ఆర్డినెన్స్ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అమల్లోకి వస్తుంది.

వివిధ పరిశ్రమలు, ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమల పెట్టుబడి ప్రతిపాదనలకు అనుగుణంగా ఈ నెల పదోతేదీన జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్(ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న



నిర్ణయాలకు ఆమోదం కోసం ప్రతిపాదన, వాటికి అవసరమైన భూముల కేటాయింపు, సక్రమంగా ఆమోదించడం,మౌలిక వసతులను కల్పించడం, సంబంధిత విధి విధానాల ప్రకారం ప్రోత్సాహకాల ప్రత్యేక ప్యాకేజీని విస్తరించడం వంటి అంశాలపై పరిశ్రమలు, వాణిజ్య శాఖ చేసిన ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదించింది.

ఒప్పందం సమయంలో పనిచేయని కాలానికి పరిహారం చెల్లించడానికి ఎటువంటి అదనపు చెల్లింపు అవసరం లేకుండా ఏడు పూర్వ జిల్లాల (శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, గుంటూరు,చిత్తూరు, కడప, అనంతపురం)సీనరేజ్ ఫీజు వసూలు కాంట్రాక్టుల కాంట్రాక్ట్ వ్యవధిని పొడిగించడానికి ఆమోదం కోసం చేసిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ చిన్న ఖనిజాల విధానం 2025 ను మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు. ఈ విధానం ద్వారా రాష్ట్రంలో ఖనిజ ఉత్పత్తులు పెరగడం,పెట్టుబడి దారులను ఆకర్షించడం, కార్యకలాపాలను పెంచడం, సుస్థిర గణన పద్ధతులను ప్రోత్సహించడం, అనుసరణను సరళీకరించడం, పాత సమస్యలను పరిష్కరించడం, పారదర్శక సాంకేతిక నియంత్రణను అమలు చేయడం, రాష్ట్ర ఖజానాకు నిశ్చితమైన ఖనిజ ఆదాయాన్ని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది.

పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఈ నెల తొమ్మిదోతేదీన జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ధ్రువీకరించేందుకు ఆమోదం కోసం ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల పరిశ్రమలు వాణిజ్యం (ఎం-Ⅲ) శాఖ ఏపీఎండీసీ ఆర్థిక బలం, క్రెడిట్‌ను మెరుగుపర్చుతుంది. అలాగే రూ.9,000 కోట్ల బాండ్లను జారీ చేయడానికి అనుమతించే ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. ఈ ప్రతిపాదన ప్రకారం ఏపీఎండీసీ ను "పబ్లిక్" కంపెనీగా మార్చడం, ప్రస్తుత వాటాదారులకు అదనంగా నలుగురు అధికారులను వాటాదారులుగా నియమించడం, కంపెనీ మెమొరాండం, ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లో అవసరమైన మార్పులు చేయడం వంటి చర్యలు చేపట్టబడతాయి. ఈ చర్యల వలన ఏపీఎండీసీ ఆర్థిక స్థితి బలోపేతమై, మెరుగైన సేవలు అందించగలదు.

విశాఖపట్నంలోని ఐటి హిల్ నం.3లో రూ.1,370 కోట్ల పెట్టుబడితో ఐటి క్యాంపస్ ఏర్పాటు కోసం, 12,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్‌కి మొత్తం 21.16 ఎకరాల భూమి కేటాయింపునకు ఆమోదం కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదే విధంగా విజయనగరంలో మహామాయ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ద్వారా సమగ్ర ఉక్కు ప్లాంట్ విస్తరణ, శ్రీసిటీ తిరుపతిలో ప్రొటేరియల్ లిమిటెడ్ ద్వారా అమోర్ఫస్ మెటల్ తయారీ సదుపాయం ఏర్పాటు, విశాఖపట్నంలో అర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా డేటా సెంటర్, ఐటి కార్యాలయ స్థలం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ద్వారా కొత్త ఐటి క్యాంపస్ కోసం చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం లభించింది.

సీఆర్డీఏ పరిధికి సంబంధించిన రెండు పనులకు ఎల్1 బిడ్లను ఆమోదించడానికి ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం ఇచ్చే ప్రతిపాదన, అంటే శాసనసభ భవనం (రూ.617.33 కోట్లు), హైకోర్టు భవనం (రూ.786.05 కోట్లు)... ఈ పనులను ఎల్1 బిడ్డర్లకు అప్పగించడానికి ఎల్‌వోఏ జారీ చేయడం, ఏపీసీఆర్డీఏ అథారిటీ వారి తీర్మానం ద్వారా ఆమోదించిన నిర్ణయాలను అమలు చేయడానికి చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాష్ట్రంలో డేటా-ఆధారిత ప్రణాళిక అండ్ సామర్థ్య నిర్మాణం ద్వారా వాతావరణ గవర్నెన్స్ మెకానిజమ్‌లను బలోపేతం చేయడానికి వాతావరణ కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయడానికి సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్,ఇంటిగ్రేట్ అండ్ సస్టైన్ 2.0 కార్యక్రమం కింద నగరాల కోసం రాష్ట్ర వాతావరణ కేంద్రం ఏర్పాటుకు ఆమోదం కోసం ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని మూడు పాత జిల్లాల్లో మిగిలిన 199 కు సంబంధించిన 11 కేవీ మిశ్రమ వ్యవసాయ ఫీడర్ల విభజన పనులను చేపట్టడానికి మంజూరు చేసిన సవివర ప్రాజెక్ట్ నివేదికలను ఆమోదించడానికి, ఆర్డీఎస్ఎస్ కింద పనులు చేపట్టడానికి చేసిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఒరిస్సా పవర్ కన్సార్టియం లిమిటెడ్‌కి రెండు ప్రాజెక్టులు అనగా బలిమేల (చిత్రకొండ) ఆనకట్ట పవర్ హౌస్, జాలాపుట్ డ్యామ్ పవర్ హౌస్ కేటాయింపునకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

ఏపీ ఏకీకృత స్వచ్ఛ ఇంధన విధానం 2024 కింద కర్నూలు జిల్లాలోని అస్పారిలో పవన విద్యుత్ ప్రాజెక్టును స్థాపించడానికి జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది.

అనంతపురంజిల్లాలోని గుత్తి, పామిడి మండలాల్లోని గ్రామాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులను స్థాపించడానికి రిన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

శ్రీ సత్య సాయి జిల్లాలోని మడకశిర మండలంలోని హరేసముద్రం, బుల్లసముద్రం, ఉప్పర్లపల్లి, ఎర్రబొమ్మనహళ్లి, కల్లుమర్రి, మనూరు, సమీప గ్రామాలలో సౌర విద్యుత్ ప్రాజెక్టును బీఈఎస్ఎస్‌తో పాటు స్థాపించడానికి M s. చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

తిరుపతి జిల్లాలోని చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం,తూర్పు కనుపూరు, వెల్లపాలెం గ్రామాలలో, కోట మండలంలోని కర్లపూడి, సిద్ధవరం గ్రామాలలో సౌర విద్యుత్ ప్రాజెక్టును బీఈఎస్ఎస్ తో పాటు స్థాపించడానికి చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం గ్రామంలో గల సర్వే నంబర్ 110-02 లోని 6.35ఎకరాల భూమిని ఉచితంగా(లేదా) నామమాత్రపు లీజు ప్రాతిపదికన ప్రజా ప్రయోజనాల కోసం ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కి 100 పడకల ఆసుపత్రి, సిబ్బంది నివాసాల నిర్మాణం కోసం కేటాయించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఏలూరు జిల్లా ద్వారక తిరుమల మండలంలోని ఐఎస్ రాఘవపురం శివారు ఐఎస్ జగన్నాథపురంలో గల సర్వే నంబరు 425/193 లో 30.00 ఎకరాల ప్రభుత్వ భూమిని 'శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయం' అభివృద్ధి కోసం దేవాదాయ శాఖకు ఉచితంగా కేటాయించడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

నెల్లూరు జిల్లా,ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్ కు 87.56 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి ఉచితంగా కేటాయిస్తూ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం,రెల్లి గ్రామంలో రాష్ట్ర హోం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రానికి సర్వే నెంబర్లు 367-1, 368లలో గల 516.58 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరం రూ. 27లక్షలకు కేటాయి స్తూ గతంలో జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 630 ను రద్దు పరుస్తూ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

2018 ఆగస్టులో సంభవించిన తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు యర్రకాల్వ పరివాహక ప్రాంతంలో పడిన గండ్లు ఇతర 48 పునరుద్ధరణ పనులను తాత్కాలిక ప్రాతిపదికన రూ.331 లక్షల అంచనా వ్యయంతో చేసిన పనులకు పోస్ట్ ఫ్యాక్టో పరిపాలన ఆమోదానికి చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ లోని 2, 4 ప్యాకేజీలకు సంబంధించి నల్లమల జలాశయాన్ని నింపడానికి అవసరమైన కీలక పనులకు రూ.106.39 కోట్ల పరిపాలనామోదానికి చేసిన ప్రతిపాదనలకు,"ఫీడర్ కాలువ, తీగలేరు కాలువ హెడ్ వర్క్స్"పనులు కొనసాగించడానికి, "తూర్పు ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్" పనులను ఆయా కంపెనీలకు వర్క్ ఆర్డర్ జారీకి చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రవర్గం ఆమోదం తెలిపింది.

పోలవరం ప్రాజెక్ట్ మిగిలిన హెడ్ వర్క్స్ పనులు అప్పగించబడిన నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ కు,ఒప్పంద షరతుల ప్రకారం చెల్లించవలసిన రూ.57.56 కోట్ల మొత్తాన్ని, తుది బిల్లుతో పాటు చెల్లించవలసిన రూ.36.37 కోట్ల చెల్లించేందుకు ఆమోదం కోసం చేసిన ప్రతిపాదలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పేషీలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఒక వీడియోగ్రాఫర్ పోస్ట్ ను నెలకు రూ.60,000/- పారితోషికంతో నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ వీడియోగ్రాఫర్ పదవీ కాలం ఉప ముఖ్యమంత్రి పదవీ కాలానికి అనుగుణంగా కొనసాగుతుంది.

# నేను కొంచెం రౌడీ టైప్

**మొదటి పేజీ తరువాయి..**

రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ.

వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలి. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి. తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడించింది బీఆర్ఎస్ పార్టీ.

స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఒకైక పోరాటం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమం మాత్రం. వీరులు మాత్రమే లక్ష్యం చేరే వరకు పోరాటం చేస్తారు. అది కేసీఆర్ తో మాత్రమే సాధ్యమైంది. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని హింసాయుతంగా పోరాటం చేసి తెలంగాణ సాధించాము. త్యాగాలతో తెలంగాణ కోసం కేసీఆర్ మొదటి అడుగు వేశారు. కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్ ది.

ఎవరో భిక్షపెడితేనో, ఎవరో దయదలచి ఇస్తే తెలంగాణ రాలేదు. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాటపటిమ వల్ల తెలంగాణ సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కటిక చీకటి వస్తుంది, నక్సలైట్ల రాజ్యం వస్తుంది అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణను తయారు చేసుకున్నాం. కోటి ఎకరాల మాగాణను తయారు చేసుకున్నాం

సాగు నీళ్ల పన్ను మాఫీ చేసిన వ్యక్తి కేసీఆర్. రైతు బంధు, రైతు బీమా వంటి అనేక కార్యక్రమాలను కేసీఆర్ చేపట్టారు. చివరి గింజ వరకు వడ్లు కొని చరిత్ర సృష్టించిన కేసీఆర్.

## 'మన చంద్రన్న- అభివృద్ధి-సంక్షేమ విజనరీ'
# పుస్తకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

- రచయిత... టీడీపీ సీనియర్ నేత టీడీ జనార్దన్ చొరవ
- 700 అంశాలతో పాకెట్ సైజ్ పుస్తకం రూపకల్పన

**అమరావతి, మహానాడు:** 'మన చంద్రన్న అభివృద్ధి-సంక్షేమ విజనరీ' పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ టీ.డీ జనార్దన్ రూపొందించిన ఈ పుస్తకాన్ని మంగళవారం సచివాలయంలో సీఎం ఆవిష్కరించారు. చంద్రబాబు బాల్యం, విద్యాభ్యాసం, యూనివర్సిటీలో విద్యార్థి నాయకుడిగా పోషించిన పాత్ర, రాజకీయ అరంగ్రేటం వంటి అంశాలు చిత్రాలతో కూడిన పుస్తకాన్ని రూపొందించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన సేవలను ఈ పుస్తకంలో ప్రస్తావించారు.



మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం, కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటులో పోషించిన పాత్రను గురించి పొందుపరిచారు. అలిపిరిలో బాంబు ఘటన, వస్తున్నా మీకోసం పాదయాత్ర, ప్రజా పోరాటాలను గురించి వివరించారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన పబ్లిక్ పాలసీలు ఉమ్మడి ఏపీలో ఏ విధంగా ప్రభావం చూపించాయి.

దేశంలో ఎటువంటి ముద్ర వేశాయో పుస్తకంలో వివరించారు. వ్యవసాయాభివృద్ధి, నదుల అనుసంధానం ఇలా 700 అంశాలతో పాకెట్ సైజ్ పుస్తకాన్ని రూపొందించారు.

## కేంద్ర గిరిజన వర్సిటీ నిర్మాణ పూర్తికి
# సహకారం అందిస్తాం

**మొదటి పేజీ తరువాయి..**

అడ్మిన్ బిల్డింగ్‌తో పాటు వసతి భవనాలు, అకడమిక్ బ్లాక్స్ నిర్మిస్తున్నారు. ఈ పనులు వేగవంతం చేయాలని వీసికి సీఎం సూచించారు. ఏడాదిలోగా అన్ని నిర్మాణాలు పూర్తి చేసి....భవనాలను అందుబాటులోకి తేవాలని అన్నారు. నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకరిస్తామని సీఎం చెప్పారు. వర్సిటీకి అవసరమైన తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, అప్రోచ్ రోడ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సత్వరం కార్యాచరణ చేపట్టాలని సమావేశంలోనే సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు.

వర్సిటీకి రెండు కి.మీ మేర అప్రోచ్ రోడ్ పనులు పూర్తి చేస్తే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని వీసి చెప్పగా...ఆ పనులు వెంటనే ప్రారంభిస్తామని సీఎం అన్నారు. 100 మంది టీచింగ్ స్టాఫ్ అవసరం ఉండగా...ప్రస్తుతం కేవలం 18 మంది మాత్రమే ఉన్నారని వర్సీటి అధికారులు తెలిపారు. సిబ్బందిని మరింత పెంచాల్సిందిగా కోరుతూ ప్రధానికి లేఖ రాస్తానని సీఎం తెలిపారు. మే నెలలో నిర్వహించే యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రావాల్సిందిగా రాష్ట్రం నుంచి కూడా కోరుతూ ప్రధానికి లేఖ రాస్తామని వర్సిటీ అధికారులతో సీఎం చంద్రబాబు అన్నారు.

2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కాగా అప్పటి నుంచి అద్దె భవనాల్లో క్లాసులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం వర్సిటీని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల పనులు జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వర్సిటీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ప్రస్తుతం ఈ యూనివర్సిటీలో 600 మంది విద్యార్థులు వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు.

సొంత భవనాలు పూర్తి అయితే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని....నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. కొలువులు సాధన, నైపుణ్యం పెంచేలా బోధన ఉండేలా చూడాలని సీఎం వర్సిటీ అధికారులను కోరారు. ప్రస్తుత పరిశ్రమ, సమాజ అవసరాలకు అనుగుణంగా కోర్సులను అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## సోనియా, రాహుల్ గాంధీపై
# ఈడీ ఛార్జిషీట్

**మొదటి పేజీ తరువాయి..**

పిట్రోడా, సుమన్ దూబేతో సహా అనేక మంది పేర్లను పేర్కొంది.

ఈ వ్యవహారంపై ఈ నెల 25న ప్రత్యేక కోర్టు విచారణ నిర్వహించనున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ అగ్రనేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. కాగా, హర్యానాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల్లోనే చార్జిషీట్ దాఖలు చేయడం గమనార్హం. సీనియర్ కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా, సుమన్ దూబేతో సహా అనేక మంది పేర్లను పేర్కొంది.

# తెలంగాణ పథకాలతో మోదీ ఉక్కిరి బిక్కిరి

**మొదటి పేజీ తరువాయి..**

క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధి దారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలి. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించాం.

విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం.ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనం. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు





శాశ్వత పరిష్కారం చూపాం. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తా. హెచ్ సీ యూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసింది.

ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారు. బీజేపీ, బీఆరెస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది.

నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి,బిక్కిరి అవుతున్నాడు.

వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది. కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోంది. దేశంలో తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆరెస్ ఒక్కటయ్యాయి. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలి.సన్న బియ్యం మన పథకం..మన పేటెంట్,మన బ్రాండ్.





## ఒక కొణిదెల అన్నా.. ఒక వైఎస్ జగన్..
# ఒక తిరుమల డిక్లరేషన్

**మొదటి పేజీ తరువాయి..**

జరుగుతాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియలు కూడా పూర్తిగా క్రైస్తవ పద్ధతులోనే జరిగిన విషయం తెలిసిందే. అయినా అప్పటి టీటీడీ అధికారులు, చైర్మన్లు జగన్ తిరుమల వచ్చినప్పుడు డిక్లరేషన్ అడక్కుండా, సన్మానం చేసి పంపించిన అధర్మం అందరికీ తెలిసిందే.

కాగా ముఖ్యమంత్రులుగా చేసిన చంద్రబాబునాయుడు సహా చాలామంది సీఎంలు.. తమ భార్య, కుటుంబసభ్యులతో వచ్చి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన దృశ్యాలు భక్తకోటి చూసినవే. సకటుంబ సపరివార సమేతంగా వచ్చే సీఎంల కుటుంబాలు, దైవ సన్నిధిలో చాలాసేపు గడుపుతుంటాయి.

కానీ జగన్ పార్టీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటివరకూ, వెంట తన భార్య భారతీరెడ్డిని ఒక్కసారి కూడా తీసుకురాలేపోయారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సమయాల్లో కూడా భారతీరెడ్డి లేకపోవటంతో, ఆమె క్రైస్తవురాలు కాబట్టి హిందూ ధర్మంపై నమ్మకలం లేదన్న అభిప్రాయం హిందూ సమాజంలో బలపడింది. అయినా దానిని దిద్దుబాటుకు దిగేందుకు ఇష్టపడలేదు.ఇప్పుడు పవన్ కల్యాణ్ భార్య అన్నా.. నిఖార్సయిన క్రైస్తవురాల యినప్పటికీ, హిందూ మత విశ్వాసాలు గౌరవించడమే కాకుండా, తలనీలాలు ఇవ్వడం అసాధారణ అంశం. పవన్ కల్యాణ్ భార్య అన్నా రష్యన్ దేశస్తురాలు. రోజువారీ దైనందిక కార్యక్రమాల్లో ఆమె క్రైస్తవాన్ని అనుసరిస్తున్నప్పటికీ, తిరుమలకు వెళ్లి గుండు

చేయించుకున్న తీరును హిందూ సమాజం స్వాగతించడమే కాదు. నిండు మనసుతో ఆశీర్వదిస్తోంది. సింగపూర్‌లో చదువుకుంటున్న తన కొడుకు ప్రాణహాని లేకుండా సురక్షితంగా బయటపడినందుకు, ఆమె తన మొక్కు చెల్లించుకునేందుకు తిరుమలకు వచ్చినట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు అన్నా అంశంలో.. జగనన్న పరిస్థితి ఇరకాటంలో పడింది. అసలు సిసలు క్రైస్తవురాలయిన అన్నా పవనే డిక్లరేషన్ ఇచ్చి, తలనీలాలు సమర్పిస్తే.. మతం మారిన 'కొసరు క్రైస్తవుడయిన' జగన్ ఎందుకు డిక్లరేషన్ ఎందుకు ఇవ్వరు? తన భార్య భారతీరెడ్డిని తిరుమలకు ఎందుకు తీసుకురారు? అంటే మీకు హిందూధర్మంపై విశ్వాసం లేదా? అంటూ హిందువులు,సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నల వర్షం కురిపి స్తున్నారు.

ఇక పవన్ భార్య అన్నా.. నిత్యాన్నదాన పథకానికి 17 లక్షల విరాళం ఇచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు తన మనుమడు దేవాన్ష్ పుట్టిన తర్వాత, ప్రతి ఏడాది మనుమడి పుట్టినరోజు సందర్భంగా తిరుమల వెళ్లి, అన్నదాన పథకానికి భారీ విరాళం ఇచ్చే సంప్రదాయం తెలిసిందే.

కానీ ఐదేళ్లు సీఎం, అంతకుముందు ఎంపి-ఎమ్మెల్యే, పారిశ్రామిక వేత్త కూడా అయిన జగన్.. ఇప్పటివరకూ ఎర్రయాగాణి కూడా టీటీడీకి విరాళంగా ఇవ్వకపోవడమే విచిత్రం. అన్నా కొణిదెల వచ్చి, జగన్‌కు ఇన్ని తిప్పలు తెచ్చారన్నమాట!

జనం గుండె చప్పుడు

# మహానాడు

03

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025






# మీరంతా విజేతలు..

## మిమ్మల్ని చూసి గర్వపడుతున్నా!

- మీరంతా ప్రభుత్వ విద్య పరువును కాపాడారు
- ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారికి మంచి మార్కులు రావనే ముద్రను చెరిపేశారు
- మిమ్మల్ని చూసి చాలామంది స్ఫూర్తి పొందాలి!
- కలల సాధనకు కష్టపడాలి.. ప్రోత్సహించే బాధ్యత నాది!
- పేదరికం వల్ల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదు
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రాష్ట్రస్థాయి టాపర్ లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించిన మంత్రి లోకేష్

**ఉండవల్లి, మహానాడు:**

మీరంతా ప్రభుత్వ విద్య పరువును కాపాడారని, ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారికి మంచి మార్కులు రావనే ముద్రను చెరిపేశారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మీరంతా విజేతలు.. మీకు హ్యాట్సాఫ్.. మీ అందరితో ఇలా కూర్చోవడం నా అదృష్టం.. మిమ్మల్ని చూసి చాలా గర్వపడుతున్నాని భావోద్వేగానికి గురయ్యారు. ప్రైవేటు ఇంటర్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యనభ్యసించి మార్కుల్లో రాష్ట్రస్థాయి టాపర్ లుగా నిలిచిన 52 మంది విద్యార్థులను "షైనింగ్ స్టార్స్-2025" పేరుతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించి సన్మానించారు. ఉండవల్లి నివాసంలో జరిగిన "షైనింగ్ స్టార్స్-2025" కార్యక్రమంలో విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందించి ల్యాప్ ట్యాప్ లను బహూకరించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు, విద్యార్థులకు నా హృదయపూర్వక నమస్కారాలు. విద్యార్థుల విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు ఇక్కడకు వచ్చాను. పేదరికం వల్ల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదు. ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. జూనియర్ కాలేజీల విషయానికి వస్తే వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేశారు. పాయకాపురంలో ఓ చెల్లితో మాట్లాడినప్పుడు.. తల్లిదండ్రులను కోల్పోయిన తనను చేపలమ్మి వాళ్ల అమ్మమ్మ చదివిస్తోందని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించడం వల్ల ఆమెపై భారం తగ్గిందని చెప్పారు.

### ఆ ముద్రను చెరిపేశారు

మీరందరూ విజేతలు. ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారికి మంచి మార్కులు రావనే ముద్రను చెరిపేశారు. ఇవాళ మీరందరూ బ్రాండ్ అంబాసిడర్స్. విద్యార్థుల మధ్య పోటీ ఉండాలి. నేను తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు ఆడుతూ, పాడుతూ ఉండేవాడిని. క్రికెట్ ఆడేవాడిని. పదో తరగతికి వచ్చిన తర్వాత నన్ను బాగా రుద్దారు. నేను కూడా రుద్దుడు బ్యాచ్‌నే. తర్వాత ఇంటర్ రెండేళ్లు బాగా కష్టపడ్డాను. మూడేళ్ల పాటు చాలా కీలక సమయం. తర్వాత స్టాన్ ఫోర్డ్‌లో ఎంబీయే చేశాను. వరల్డ్ బ్యాంక్ లో పనిచేశాను. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంటర్ విద్యలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాం. టెక్ట్స్, నోట్ పుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాం. ప్రిన్సిపల్స్ కు ప్రమోషన్లు ఇచ్చాం. ఇలా అనేకం చేశాం. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. విద్యాశాఖలో జూన్ నాటికి సంస్కరణలు పూర్తిచేసి అనంతరం లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టి పెడతాం.

### మిమ్మల్ని చూసి చాలామంది స్ఫూర్తి పొందాలి

మిమ్మల్ని చూసి చాలామంది ఇన్ స్పైర్ కావాలి. టాప్ మార్కులు సాధించిన వారిలో బాలికలు ఎక్కువమంది ఉన్నారు. వ్యాపారంలో కూడా మహిళలు చాలా బాగా రాణిస్తారు. చదువు, వ్యాపారంలో నాకంటే బ్రాహ్మణి చాలా బెటర్. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలి. అన్నివిధాల ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. ఫీజు రీయింబర్స్ మెంట్ తో పాటు విదేశీ విద్యకు ప్రత్నామ్నాయం తీసుకువస్తాం. నేను స్టాన్ ఫోర్డ్ లో ఎంబీయే చదివేందుకు వెళ్లినప్పుడు మీ వద్ద ఎన్ని డబ్బులు ఉన్నాయి, బ్యాంక్ బ్యాలెన్స్ ఎంత ఉందని అడగలేదు. ఇంటర్వ్యూ తర్వాత కావాల్సిన వారికి లోన్, ఇంటర్న్‌షిప్ అందిస్తారు.

### పేదరికం వల్ల విద్య ఆగిపోకూడదనేది మా లక్ష్యం

డబ్బులు లేవని పిల్లలు ఇబ్బందిపడకూడదనేది మా లక్ష్యం. మీరు ఈ స్థాయికి వచ్చారంటే తల్లిదండ్రుల త్యాగాల వల్లే. ఇది మర్చిపోకూడదు. కఠిన సవాళ్లు ఎదురైనా ఎదుర్కోవాలి. 40 ఏళ్లలో ఎప్పుడూ గెలవని మంగళగిరిని నేను ఎంచుకుని పోటీ చేశా. అనేక ఇబ్బందులు ఎదుర్కొని విజయం సాధించాను. స్ట్రగుల్ ఉన్నప్పుడే గెలుస్తారు. కష్టమైనా ఏరికోరి విద్యాశాఖను ఎంచుకున్నా. టార్గెట్ పెట్టి మరీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాకు ఈ శాఖను అప్పగించారు. ఇంటర్ తర్వాత కూడా ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలి. అందరూ ఐటీ వైపే వెళ్లానుకోవడం కరెక్ట్ కాదు. ఇవాళ సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ ఒకటి క్లియర్ అయింది. నెల్లూరు, అనకాపల్లి సోలార్ ఎనర్జీ ప్లాంట్ లు వస్తున్నాయి. కనిగిరిలో రిలయన్స్ కంప్రెస్ట్ బయో గ్యాస్ ప్లాంట్ ను ఏర్పాటుచేసింది. కొత్త సెక్టార్స్ వస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆయా రంగాలను ఎంచుకోవాలి.

### కలల సాధనకు కష్టపడాలి.. ప్రోత్సహించే బాధ్యత నాది

జీవితం అనేది జర్నీ.. నాట్ డెస్టినేషన్. ఈ మధ్య కాలంలో విద్యార్థులు బాగా సున్నితంగా ఉంటున్నారు. ఇంటర్ ఫలితాలు ఎలా విడుదల చేయాలనేది మేం రెండు గంటల పాటు చర్చించాం. లక్ష్యం కోసం పనిచేయాలి. చిన్నచిన్న ఆటుపోట్లు ఎదురైనా తట్టుకోవాలి. మీకు అన్ని విధాల సహకారం అందిస్తాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తాం. కలల సాధనకు కష్టపడాలి. ప్రోత్సహించే బాధ్యత నాది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో వసతులను మెగురుపరుస్తాం. ఇంటర్మీడియట్ లో యూనిఫాం అందిస్తే బాగుంటుందని చాలా మంది విద్యార్థులు కోరారు. మీ ఫీడ్ బ్యాక్ ను సీరియస్ గా తీసుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. సమస్యలు ఏవైనా ఉంటే కూర్చొని మాట్లాడుకుందాం. ఇంటర్ తర్వాత కాలేజీలకు వెళ్తారు. ఫ్రీడమ్ ను దుర్వినియోగం చేసుకోవద్దు. కాలేజీల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే క్యాంపెయిన్ ను చేపట్టాం. చాలా సీరియస్ గా తీసుకున్నాం.

### జాబ్ సీకర్స్ కాదు.. జాబ్ క్రియేటర్స్ కావాలి

జీవితాంతం కుటుంబానికి అండగా ఉండాలి. నేను కూడా పనిఒత్తిడిలో మా అమ్మగారితో, దేవాన్ష్ తో మాట్లాడాలనే విషయం మిస్ అవుతున్నా. ఏదైనా తప్పు జరుగుతుంటే ప్రశ్నించాలి. ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక బాధ్యతల గురించి కూడా మాట్లాడాలి. స్వచ్ఛతలో మంగళగిరిని నెం.1గా మార్చే క్రమంలో వెయ్యి టన్నుల చెత్త బయటపడింది. మన పరిసరాలను చెత్త రహితంగా ఉంచుకోవాలి. మీరంతా జాబ్ సీకర్స్ గా కాకుండా జాబ్ క్రియేటర్స్ కావాలి.

### ప్రభుత్వ విద్య పరువును కాపాడారు..

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీల్లో రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచిన మీరంతా విజేతలు. మీకు హ్యాట్సాఫ్. విలువలు మర్చిపోకూడదు. విలువలు మర్చిపోతే జీవితాంతం మిమ్మల్ని ఎవరూ నమ్మరు. మీరంతా జీవితంలో అద్భుతంగా రాణించాలని కోరుకుంటున్నా. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి. డ్రీమ్ బిగ్.. స్టే గ్రౌండెడ్. మీరంతా జీవితంలో విజయాలు సాధించి దేశం కోసం నిలబడాలి. మీ అందరితో ఇలా కూర్చోవడం నా అదృష్టం. నేను చదువుకునే రోజుల్లో నేనెప్పుడూ టాపర్ ను కాను. బ్యాంక్ బెంచ్ స్టూడెంట్ ను. మిమ్మల్ని చూసి చాలా గర్వపడుతున్నా. మీరంతా ప్రభుత్వ విద్య పరువును కాపాడారు. ఇవాళ జరిగిన కేబినెట్ లో కూడా పలువురు మంత్రులు అభినందించారు. చాలా బాగా చేశారని చెప్పారు. సక్సెస్ వచ్చిన తర్వాత బాధ్యత పెరిగిందని.. ఇది తొలి అడుగు మాత్రమేనని అన్నారు.



























జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025 ||



## ఇవిగో కేసీఆర్ ఆనవాళ్లు!

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**బాన్సువాడ:** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని చెప్పడానికి ఇదిగో ఆనవాళ్లు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ కేంద్రం సమీపంలో మంజీరా నదిపై నిర్మించిన చింతల నాగారం చెక్ డ్యాం ను ఆమె సందర్శించారు. మండు వేసవి లోనూ మత్తడి దుంకుతున్న ఈ చెక్ డ్యాం కేసీఆర్ తెలంగాణ ను పచ్చబడేయడానికి పడ్డ తపనను గుర్తు చేస్తుందన్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలో మంజీరా నదిపై ఇలాంటి నాలుగు చెక్ డ్యాంలు నిర్మించి రైతులు వాన కోసం ఎదురు చూడకుండా పంటలు పండించుకునేలా కేసీఆర్ గారు చేశారన్నారు. ఈ ఒక్క చెక్ డ్యాం పై



ఆధారపడి 1600 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు.









## చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోకి సింగరేణి

- నేడే ఒడిశా లో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభం
- 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోకి సింగరేణి
- గనిని లాంఛనంగా ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం గల అతి పెద్ద గని
- గని జీవితకాలం 38 ఏళ్ళు
- సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి

**సింగరేణి భవన్:** సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్ర లో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించనుంది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ ను ఏప్రిల్ 16వ తేదీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడాన్ని ఒక చరిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు.

### తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ...

2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు సింగరేణికి కేటాయించినప్పటికీ, అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ,ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవ చూపుతూ అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, ప్రస్తుత బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని క లిసి విజ్ఞప్తులు చేశారు.

అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకంగా పర్యటించి ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపి గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. దీంతో చివరికి సింగరేణీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహదపడనుంది.

### నైనీ బొగ్గు బ్లాక్ విశేషాలు

ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయటానికి అవకాశం ఉంది. ఈ గని లో ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు అనగా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది.

- సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్ కాస్ట్ గనుల కన్నా ఇదే అతి పెద్ద గని కానున్నది.
- ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు ఈ గని నుండి బొగ్గు తవ్వి తీయనున్నారు.
- తెలంగాణలో ప్రస్తుతం గల సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మన్ను) తొలగిస్తుండగా ఈ గనిలో మాత్రం ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. కనుక ఈ గని సింగరేణికి లాభదాయకమైనదే అని భావిస్తున్నారు.
- ఈ గనిలో మేలైన జీ - 10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది.
- ఈ గనిలో, ఓవర్ బర్డెన్ తొలగించడానికి, బొగ్గు తవ్వకానికి , బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్ట్ లను అప్పగించారు .
- ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గును ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా సమీపంలోని జరపడ రైల్వే సైడింగ్‌కు రవాణా చేసి, అక్కడి నుండి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు.
- అయితే ఈ ప్రాంతంలోగల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి ఒక ప్రత్యేక 60 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడం కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. మరో మూడేళ్లలో ఇది కార్య రూపం దాల్చే అవకాశం ఉంది.
- నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2255 ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1935 ఎకరాల అటవీ భూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఉంది.



## సీఎం ప్రజావాణి చొరవ

- ఆర్టీసీలో చరిత్రాత్మక ఘట్టం
- 136 మందికి తిరిగి విధుల్లోకి తీసుకున్న ఆర్టీసీ యాజమాన్యం
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, చిన్నారెడ్డి, దివ్యలకు ధన్యవాదాలు తెలిపిన ఆర్టీసీ ఉద్యోగులు

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి ప్రజావాణి చొరవతో, ఆర్టీసీ యాజమాన్యం అంగీకారంతో ఆర్టీసీ చరిత్రలో నూతన అధ్యయనానికి తెర లేచింది. ఆర్టీసీలో చరిత్రత్మాక ఘట్టం మంగళవారం ఆవిష్కృతమైంది. వివిధ కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగించబడ్డ 136 మంది ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యం తిరిగి విధుల్లోకి తీసుకుంది. ఇందులో కండక్టర్స్, డ్రైవర్స్, మెకానిక్స్, సెక్యూరిటీ గార్డ్స్ వంటి వాళ్ళు ఉన్నారు. ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన దాదాపు 472 మంది ఆర్టీసీ ఉద్యోగులు తమ తప్పులను క్షమించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఎం ప్రజావాణిలో ఇంచార్జ్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు కొన్ని నెలల క్రితం విజ్ఞప్తి చేశారు.

చిన్నారెడ్డి, దివ్య రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల అంశాన్ని తీసుకెళ్లారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ చైర్మన్ గా సెర్ప్ సీఈఓ, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య మెంబర్ గా, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మెంబర్ కన్వీనర్ గా కమిటీ వేశారు.

త్రీమెన్ కమిటీ ఆర్టీసీ ఉద్యోగుల విషయాన్ని పరిశీలించి తొలి విడతగా 136 ఉద్యోగులకు తిరిగి విధుల్లోకి తీడుకుంటూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన 336 మంది ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వినేందుకు బ్యాచ్ వారీగా తేదీలను ఖారారు చేసి షెడ్యూల్ ప్రకటించారు.

మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఆర్టీసీ ఉద్యోగులు చిన్నారెడ్డి, దివ్య సహా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ధన్యవాదాలు తెలిపారు.

## సీఎం చెక్కులు చెల్లుబాటు కాకపోవడం సిగ్గుచేటు

- అలవోకగా అబద్ధాలు, అడుగడుగునా వైఫల్యాలు
- కాంగ్రెస్ ఎంచుకున్న రాచమార్గం ఇది
- ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులందరిదీ ఒకే దారి
- మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో ఆర్థిక మంత్రి భట్టి గా నిన్న మంచిర్యాలలో మంచినీళ్లు తాగినంత సులువుగా మరోసారి అబద్ధాలు
- మహిళలను మోసం చేస్తున్న కాంగ్రెస్ వైఖరిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం

**హైదరాబాద్:** 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇచ్చామని మళ్ళీ అదే పాత పాట పాడి మహిళలను మోసం చేసే ప్రయత్నం చేశారు. బ్యాంకు లింకేజీ కల్పించి, మొత్తం 21 వేలు వడ్డీ లేని రుణాలే అని ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ కే చెల్లింది. మీ ప్రభుత్వం ఎప్పటి లాగే, 5 లక్షల వరకే వడ్డీ లేని రుణాలు ఇస్తున్న మాట వాస్తవం కాదా భట్టి గారు, నిజం తెలిసి కూడా ఎందుకు అవాస్తవాలు మాట్లాడుతున్నారు.

ఇదే విషయంపై అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు జీవో 27 ప్రకారం, 5లక్షల వరకే VLR వర్తిస్తది అని సమాధానం చెప్పిన మాట వాస్తవం కాదా? 5లక్షల వరకే వడ్డీ లేని రుణం, మిగతా 15లక్షలకు మహిళలే వడ్డీలు కడుతున్నరు అన్నది వాస్తవం. 20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్న మాట నిజమే అయితే సంబంధించిన జీవో బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

లేదంటే అసెంబ్లీ సాక్షిగా, బహిరంగ సభల్లో అబద్ధాలు చెప్పి మోసం చేస్తున్నందుకు యావత్ మహిళ లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.



స్వయంగా ముఖ్యమంత్రి మహిళ సంఘాలకు రెండు సార్లు ఆవే చెక్కులు ఇచ్చినా ఇప్పటికి చెల్లుబాటు కాకపోవడం సిగ్గుచేటు. నవంబర్ 19, 2024 నాడు వరంగల్ లో స్వయం సహాయక సంఘ సభ్యులకు లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులను సీఎం అందించారు. మళ్ళీ అవే చెక్కులను మార్చి 8, 2025 నాడు ఇందిరా మహిళా శక్తి పేరిట హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో సీఎం అందించారు.

అయితే ఇప్పటివరకు అవి క్లియర్ గాక మహిళా సంఘాల సభ్యులు ఎదురు చూస్తున్నారు. ఇచ్చిన చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

స్కూల్ విద్యార్థుల డ్రెస్ కుట్టు చార్జీలు 50 రూపాయలు ఇచ్చి, 75 రూపాయలు ఇస్తున్నం అని ప్రచారం చేసుకున్నరు. మేము నిలదీస్తే మిగతా 25 రూపాయలు విడుదల చేశారు, సంతోషం. కానీ ఇవి ఇంకా మహిళలకు చేరలేదు. వెంటనే చెల్లించండి. ప్రతి విద్యార్థి కొలతలు స్వయంగా వెళ్ళి తీసుకోవాలని షరతు పెట్టారు. మీరు ఇచ్చే 75 రూపాయలు ఎలా సరిపోతాయి? ఈ కుట్టు ఛార్జీలు 150 రూపాయలకు కి పెంచాలని మహిళా సంఘాల తరుపున డిమాండ్ చేస్తున్నాం.

స్వయం సహాయక బృందాలకు రుణాలు ఇచ్చే 'శ్రీనిధి' నిర్వహణ అస్తవ్యస్తంగా మారడం దురదృష్టకరం. మొత్తం రుణాలలో 40 శాతం వాటా నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ (NPA) ఉండటం శ్రీనిధి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఐఏఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించి శ్రీనిధి భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం.

మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి గారూ.. ఏడాదిన్నర పాలనలో మీరు మహిళలకు చేసింది ఎడతెగని వంచనే ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనే. మహిళలను కోటీశ్వరులను కాదు, కనీసం లక్షాధికారులుగా కూడా చేయని చేతగాని సర్కారు మీది.

ఇప్పటికైనా ప్రచార యావ పక్కన బెట్టి, మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. వడ్డీ లేని రుణాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని, లేదంటే మహిళలే మీకు బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నాం.



## వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామి

- 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి
- బియ్యం ఎగుమతి విధానంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒకరోజు సదస్సు.
- ముఖ్య అతిథిగా హాజరైన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం నుంచి తొలిసారి ఫిలిప్పయన్స్‌కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బియ్యం ఎగుమతి విధానం అన్న అంశంపై మంగళవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిధి గా హాజరు అయ్యారు.

ఆయన మాట్లాడుతూ .. దేశంలోనే వరి ఉత్పత్తిలో ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలో సుమారుగా 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయిందని ఇది ఒక రికార్డు అని చెప్పారు. ఈ ఘనత కు రైతుల కృషి తో పాటు, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ప్రకృతి సహకారం మరియు నూతన వరి రకాలు అందుబాటులో ఉండటం కారణం అన్నారు.

ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రైతాంగాన్ని అభినందించారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందనీ..సన్న రకాలకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు పోను, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం పోను, కేంద్ర నిలువల కోసం సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపు లు పోగా ఇంకా సుమారు 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రాష్ట్రంలో మిగులు ఉంటుందని ఆయన అన్నారు.

మిగులు ధాన్యం మార్కెట్ చేయడానికి అన్వేషణలో భాగంగా ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని ఫిలిప్పైన్స్ కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడాన్ని సదావకాశంగా తీసుకొని, ఆ ప్రభుత్వంతో నేరుగా అవగాహన ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. దొడ్డు రకాలలో ముఖ్యమైన MTU-1010, ఐ. ఆర్-64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని..వీటికి ఫిలిప్పీన్స్‌లో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. వరి సాగులో ఇటీవల రైతాంగంలో ఆదరణ పొందుతున్న వరి నేరుగా విత్తే పద్ధతి (DSR) రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం (AWD), తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. అదేవిధంగా ఎగుమతికి అనుకూలమైన వరి రకాలను ఉత్పత్తి చేయడానికి రైతులకు తగిన ప్రోత్సాహకాలు, ఎగుమతి దారులకు విధానపరమైన ప్రోత్సాహకాలు ఇస్తామని ఆయన ప్రకటించారు.

అధునాతన బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో ఆధునిక రైస్ మిల్లును వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు.

ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని.. ఎన్నటికీ స్వయం సమృద్ధి సాధించే దేశం కాదు కాబట్టి ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్ గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లయితే తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని చెప్పారు.

అంతేకాకుండా, ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతి దారులకు సరఫరా చేసినట్లయితే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని మంత్రికి సూచించారు.

అఖిలభారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి కృష్ణారావు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, అపెడా అధికారులు, రైతు నాయకులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు, వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత మరియు ఇటీవల విశ్వవిద్యాలయం నియమించిన యుజిసి ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ సమరేందు మహంతి ఎగుమతుల విధానం అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు.

## మంత్రులకు ఓదార్చే తీరికలేదా?

- మా వెంట మంత్రులు వస్తే ఎండిన పంటలు చూపిస్తాం
- ఎకరాకు 30 వేల రూపాయలను నష్టపరిహారం చెల్లించాలి
- మాజీ మంత్రి వి .శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**హైదరాబాద్:** రాష్ట్రంలో రైతులు పుట్టెడు దుఃఖంలో ఉన్నారు. పంటలు ఎండిపోయి కొందరు రైతులు బాధలో ఉంటే ,మరి కొందరు అకాల వర్షాలకు నష్టపోయారు. రైతుల పరిస్థితి ఘోరంగా తయారైంది. కాంగ్రెస్ మేనిఫెస్టో లో రైతు డిక్లరేషన్ లో పంట ఏ రకంగా నష్టపోయినా పరిహారం ఇస్తామని వాగ్దానం చేశారు.

కౌలు రైతులకు కూడా పరిహారం ఇస్తామన్నారు. పంటల బీమా పథకం తెస్తామని తేలేదు. నష్టాల్లో ఉన్న రైతులు ,కౌలు రైతులకు ఊరట నిచ్చే ఒక్క చర్య కూడా ప్రభుత్వం వైపు రాలేదు. రైతులను పట్టించుకునే నాథుడే లేడు. రాష్ట్రంలో మళ్ళీ 2014కు ముందు కష్టాలు వచ్చాయి. భూ భారతిపై కూడా రైతులను నయవంచన చేశారు. అసైన్మెంట్ , పోడు భూముల క్రయవిక్రయాల పై చట్టం తెస్తామన్నారు. భూ భారతి లో ఆ ప్రస్తావన ఎందుకు తేలేదు. కేసీఆర్ పై కక్ష తో రైతులను ఇబ్బంది పెడుతున్నారు. కాళేశ్వరంకు మరమ్మత్తులు చేయక గోదావరిని ఎండబెట్టారు. దేవాదుల పంప్ నెల రోజులు ఆలస్యం చేసి పంటలు ఎండబెట్టారు. పాలమూరులో ప్రాజెక్టులు ఎండబెట్టారు.

నెట్టెంపాడు ,జూరాల ఆయకట్టు కు కూడా సారిగా నీరు ఇవ్వలేదు. .రైతులు ధర్నా చేస్తున్నారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పందించడం లేదు ఏపీ కి కృష్ణా జలాలు అక్రమంగా తరలిస్తున్నా స్పందన కరువైంది. మా పర్యటనల్లో రైతులు గుండెలు అవిసేలా తమ భాదలు చెబుతున్నారు. మంత్రులకు ఓదార్చే తీరిక లేదా? గత ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడం ,అంతర్గత కుమ్ములాటలకే కాంగ్రెస్ నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారు. కరెంటు ఇవ్వక నీళ్లు ఇవ్వక పంటలు ఎండబెట్టారు. మా వెంట మంత్రులు వస్తే ఎండిన పంటలు చూపిస్తాం. కాంగ్రెస్ పాలన పదహారు నెలలు గడిచినా అక్రమ కేసులు, కక్ష రాజకీయాల్తోనే కాలం గడుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దేనిపై ముందు చూపు లేదు. తాగునీటి పై ముందస్తు కార్యాచరణ లేదు.

హైదరాబాద్‌కు తాగునీటి సమస్య కూడా వచ్చే ప్రమాదముంది. ముందే కరెంటు నీళ్లు ఇవ్వం అంటే రైతులు పంటలు వేసుకునే వారు కాదు.

రైతు నష్టాలకు ప్రభుత్వమే భాద్యత వహించాలి .ఎకరాకు 30 వేల రూపాయలను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. ఎండిన పంటలతో పాటు వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిందే. ప్రభుత్వం కాంగ్రెస్ మేనిఫెస్టో లో చెప్పినట్టు చేయకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తాం. రైతు డిక్లరేషన్ లో చెప్పిన ఆరో అంశం గా






ఉన్న అసైన్ మెంట్ ,పోడు భూముల క్రయవిక్రయాలను భూ భారతి లో చేర్చాలి.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల గొట్టే ఆలోచన లేదని కేసీఆర్ అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వాన్ని ఐదేళ్ల పాటు భరించడంగా ఉందని అనేక వర్గాలు చర్చించుకుంటున్నాయి. కడుపు మండిన వారు తమ ఆవేదన ను అనేక చోట్ల వ్యక్తం చేస్తున్నారు. మా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రజల అభిప్రాయాన్ని చెప్పి ఉండవచ్చు. మాకైతే ఈ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగాలని కోరుకుంటున్నాం.

### మంత్రుల మధ్య సమన్వయం లేదు: మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచుతోంది. ప్రాజెక్టుల నిర్మాణం పై ఎవరికీ శ్రద్ధ లేదు. మంత్రుల మధ్య సమన్వయం లేదు.

మొండి చేయి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో వేసినా తప్పు లేదు. రైతులకు మోసం చేసిన ప్రభుత్వం మూట ముల్లె సర్దుకోవాల్సిందే. పాడి రైతులకు బిల్లులు కూడా చెల్లించని అసమర్ద ప్రభుత్వం ఇది. 80 శాతం ఉన్న రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఈ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవు.





ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు మొదటి విడతగా లక్ష రూపాయల విలువైన చెక్కులను అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025

# అమరావతిలో రెండో విడత భూసేకరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కోసం భూసేకరణ బదులు పూలింగ్ చేయాలని కోరుతున్నారు
- 30 వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్ చేస్తే ప్రభుత్వానికి చివరికి మిగిలేది ఐదువేల ఎకరాలే
- గత ప్రభుత్వ నిర్వాకంతోనే అమరావతి పనులు ఆలస్యం
- రాజధాని పనుల కోసం అనంతవరంలోని గ్రావెల్ కొండలను పరిశీలించిన మంత్రి

**అమరావతి, మహానాడు:** అమరావతిలో మరోసారి భూమి సమీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఐదువేల ఎకరాల్లో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని, దానికోసం భూమి అవసరం ఉందని తెలిపారు. అయితే ల్యాండ్ ఎక్విజిషన్ ద్వారా భూములు తీసుకుంటే రైతులు నష్టపోతారనే



విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చినట్టు మంత్రి చెప్పారు..రాజధానిలోని అనంతవరంలో గ్రావెల్ క్వారీలను మంత్రి నారాయణ పరిశీలించారు. ఆ తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడను కలిపి త్వరలో మెగాసిటీ ఏర్పాటుచేయాలనే ఆలోచనతో సీఎం ఉన్నారని మంత్రి తెలిపారు. అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్టు మంత్రి నారాయణ చెప్పారు.

ల్యాండ్ ఎక్విజిషన్ ద్వారా భూములు తీసుకుంటే కేవలం రిజిస్ట్రేషన్ ధరలో రెండున్నర రెట్లు మాత్రమే ఎక్కువ వస్తుందని... అలా కాకుండా ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకుంటే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు..రైతులు కూడా ల్యాండ్ పూలింగ్ ను కోరుకుంటున్నారని అన్నారు. భూసమీకరణ ద్వారా ఎయిర్ పోర్ట్ కోసం ముప్పై వేల ఎకరాలు సమీకరించాల్సి ఉంటుందన్నారు. వీటిలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వగా మిగిలిన భూముల్లో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కోసం మరికొన్ని వేల ఎకరాలు అవసరం ఉంటుందన్నారు. ఇవన్నీ పోగా



ఇంకా ఐదువేల ఎకరాలు మాత్రమే మిగులుతుందన్నారు. అందుకే ల్యాండ్ పూలింగ్ ద్వారా ఎక్కువ భూమి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం ఎయిర్ పోర్ట్ విషయంలో భూసమీకరణ లేదా భూసేకరణ అనేది ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణం కోసం 2015లో కేవలం 58 రోజుల్లోనే రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలు భూమిని పూలింగ్ ద్వారా ఇచ్చారనే విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

### గత ప్రభుత్వ నిర్ణయంతోనే పనులు ఆలస్యం

గత ప్రభుత్వం రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడిందని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు మధ్యలో నిలిపివేసిన నాటి ప్రభుత్వం.... అప్పటి టెండర్లను కూడా రద్దు చేయకపోవడంతో న్యాయ సమస్యలు రాకుండా వాటినన్నింటిని పరిష్కరించాల్సి వచ్చిందని తెలిపారు. దీనికోసం ఎనిమిది నెలల సమయం పట్టిందన్నారు. అయితే ప్రస్తుతం రాజధానిలో పనులు ప్రారంభమయినట్టు మంత్రి తెలిపారు. మొత్తం 68 పనులకు సంబంధించి 4,2360 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి.

ఈ పనులన్నీ ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. నిర్మాణానికి సంబంధించి అవసరమైన గ్రావెల్ కోసం గనుల శాఖ 851 ఎకరాలు సీఆర్డీయే కు కేటాయించిందన్నారు. గతంలో అనంతవరం కొండను సీఆర్డీయే కు కేటాయించారని, అయితే గత ప్రభుత్వంలో 8 మీటర్ల లోతు వరకూ తవ్వేశారని అన్నారు. అయితే డ్రోన్ సర్వే ద్వారా ఎంత లోతు వరకూ తవ్వారనే దానిపై స్పష్టత తీసుకుంటామన్నారు. ఇక్కడ ఖాళీగా ఉన్న భూమిని కూడా ఏదొక అవసరానికి ఉపయోగించాలని చూస్తున్నామని వివరించారు.

### మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి

రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఒక నిర్ధిష్ట కాలపరిమితితో పనులు పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. ఏడాదిలో అధికారుల నివాస భవనాలు పూర్తి చేస్తామన్నారు. ఏడాదిన్నరలో ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో లేఅవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

# ‘వక్ఫ్’పై వైసీపీ లోక్‌సభలో ఒక డ్రామా, రాజ్యసభలో మరో డ్రామా!

- మైనార్టీలను మభ్యపెట్టి మోసం చేయాలంటే ఎ కుదరని పని జగన్ రెడ్డి...
- సిగ్గు లేకుండా వక్ఫ్ బిల్లుపై వైసీపీ సుప్రీంకోర్టుకు వెళ్లి ముస్లింలను మోసం చేస్తోంది
- ముస్లిం సమాజం కోసం జగన్ రెడ్డి చేసిన ఒక్క మంచి పని లేదు
- చంద్రబాబు ముస్లిం సమాజం కోసం అండగా ఉన్నారు
- వక్ఫ్ భూములను కాపాడేందుకు చంద్రబాబు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు
- విలేఖర్ల సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్



**మంగళగిరి, మహానాడు:** రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి చేస్తున్న డ్రామాలు, నాటకాలను రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని... ఏదో మభ్య పెట్టి మోసం చేయాలంటే రాష్ట్ర ప్రజలు సహించరని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టంపై జగన్మోహన్ రెడ్డి, వాళ్ల ఎంపీలు లోక్ సభలో వ్యతిరేకించి... రాజ్యసభలో బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. అనంతరం ఓటింగ్ అనంతరం జగన్ రెడ్డి పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసింది. రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇవ్వకముందే విప్ జారీ చేస్తారు.

కానీ, ఎంపీలు ఓటు వేసిన తర్వాత విప్ జారీ చేసి మైనార్టీలను మోసం చేశారు. గతంలో ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు అవసరం లేకున్నా సీఏఏ, ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 వంటి మైనార్టీ వ్యతిరేక బిల్లులకు వైసీపీ సంపూర్ణ మద్దతు ఇచ్చింది. ఈరోజు లోక్ సభలో ఒక డ్రామా, రాజ్యసభలో మరో డ్రామా ఆడారు. అంతేకాకుండా సిగ్గులేకుండా మళ్లీ సుప్రీంకోర్టుకు వెళ్లి పిటిషన్ వేశారు. ముస్లిం సమాజంపై జగన్ రెడ్డికి చిత్తశుద్ధి లేదు. గత వైసీపీ ఐదేళ్ల పాలనాకాలంలో మైనార్టీలను అనేక మందిని హత్య చేశారు. వారిపై దాడులకు తెగబడ్డారు. ఒక్క రోజుకు కూడా బయటికి వచ్చి విచారం వ్యక్తం చేయలేదు. దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయలేదు. ఈ రోజు 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చోబెడితే ముస్లింలపై డ్రామాలు ఆడుతున్నారు. హైదరాబాద్‌లోని సాక్షి ఆఫీస్, జగన్ మామ రవీంద్రనాథ్ రెడ్డి థియేటర్ వక్ఫ్ భూముల్లో ఉంది. మీ ఇడుపులపాయ ల్యాండ్ తో హెల్ప్ ను ఎందుకు అమ్మేశారు. ముస్లింలను మభ్యపెట్టాలని జగన్ రెడ్డి చూస్తున్నారు. ముస్లింలు జగన్ రెడ్డిని నమ్మే పరిస్థితిలో లేరు. నేడు సీఎం చంద్రబాబు ముస్లింలకు అండగా ఉన్నారు. మైనార్టీల కోసం నిలబడి వారి అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో వక్ఫ్ భూములను కాపాడే బాధ్యత చంద్రబాబు తీసుకున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం నిరసన వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉంది. దాన్ని మేం తప్పు బట్టడం లేదు. జగన్ రెడ్డిని గతంలో కూడా ఛీ కొట్టారు. ఇప్పుడు డ్రామాలు ఆడి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. అది జరగని పని అని జగన్ రెడ్డి గుర్తుంచుకోవాలి.

# వృద్ధుడిని ఆదుకున్న మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు!

**హైదరాబాద్, మహానాడు:** ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న 74 ఏళ్ల వృద్ధుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కొద్దిసేపటి తర్వాత ఆయన అపస్మారక స్థితిలోకి జారుకోవడంతో పాటు, నోటి నుండి ద్రవం బయటకు రావడం ప్రారంభమైంది. దీంతో తోటి ప్రయాణికులు, విమాన సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. అయితే, అదే విమానంలో ప్రయాణిస్తున్న ప్రీతి రెడ్డి ఈ పరిస్థితిని గమనించి తక్షణమే స్పందించారు.



వృత్తిరీత్యా వైద్యురాలైన ఆమె, ఆ వృద్ధుడిని ప్రాథమికంగా పరీక్షించారు. రక్తపోటు(బీపీ) బాగా తగ్గిపోయిందని నిర్ధారించుకున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే సీపీఆర్ ప్రక్రియను ప్రారంభించారు. కొంత సమయం పాటు ఆమె చేసిన ప్రయత్నం ఫలించి, వృద్ధుడి పరిస్థితి కొంత మెరుగుపడింది. విమానం ల్యాండ్ అయిన వెంటనే, విమానాశ్రయ సిబ్బంది ఆ వృద్ధుడిని మెరుగైన వైద్యం కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆ వైద్యురాలు మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతి రెడ్డి అని అందరికీ తెలిసింది. అపదలో ఉన్న వృద్ధున్ని ఆదుకున్నందుకు ఆమెను సర్వత్రా అభినందించారు.

# చిత్తూరు జిల్లాలో కొత్తగా ప్రైవేట్ హోమియోపతి కళాశాల

- ప్రైవేట్ రంగంలో ఇది ఐదో కళాశాల

**అమరావతి, మహానాడు:** ఆయుష్ వైద్య విధానాలను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు కొత్తగా ప్రైవేట్ హోమియోపతి కళాశాల మంజూరైంది. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు హోమియోపతి కళాశాలలు మాత్రమే ఉన్నాయి. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం ముత్తిరేవుల గ్రామంలో శ్రీనివాస ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా హోమియోపతి కళాశాల ఏర్పాటుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపారు. వెంకటేశ్వర హోమియోపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ పేరుతో కొత్త ప్రైవేట్ కళాశాలలో ప్రతి సంవత్సరం 100 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. సొసైటీలో ఇప్పటికే 50 పడకల ఆసుపత్రి ఉంది. అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల లభ్యతను సవివరంగా పరిశీలించిన తర్వాత మంత్రి ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏడు హోమియోపతి కళాశాలలున్నాయి. ఐదున్నరేళ్ల బీహెచ్ఎంఎస్(బీహెచ్ఎంఎస్) కోర్సులలో ఏడాదికి 500 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు జాయిన్ అవుతున్నారు. వీటిలో గుడివాడ, రాజమండ్రి, కడపలోని మూడు ప్రభుత్వ హోమియోపతి కళాశాలల్లో ఏడాదికి 120 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ప్రస్తుతం గుంతకల్లు, తిరుపతి, తాడేపల్లిగూడెం, విజయనగరంలో ఉన్న నాలుగు ప్రైవేట్ హోమియోపతి మెడికల్ కాలేజీలు యూజీ ప్రోగ్రామ్‌లో ఏడాదికి 400 మంది విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రతి హోమియోపతి కళాశాలలో రోజూ దాదాపు 250 మంది రోగులు అవుట్ పేషెంట్ (ఓపీ) సేవల్ని, 15 మంది రోగులు ఇన్ పేషెంట్ (ఐపీ) సేవల్ని పొందుతున్నారు.

# ఏ సహాయం కావాలన్నా మా తలుపులు తట్టండి

- ప్రజాసేవే నా విధి
- జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హామీ

**నరసరావుపేట, మహానాడు:** నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ ను కట్ చేసి గజమాలలతో అభిమానులు సత్కరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు నియోజకవర్గ ప్రజలు నరసరావుపేట ప్రముఖ వైద్యులు, లాయర్లు, జర్నలిస్టులు, వివిధ పార్టీ ప్రజా సంఘ నాయకులు, ప్రభుత్వ అధికారులతో టీడీపీ కార్యాలయం కిక్కిరిసిపోయింది. కూటమి నేతలు సర్వమత ప్రార్థనలు చేశారు.

కూటమి నేతలు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు కష్టాలలో ఉంటే అరవింద బాబు ఆదుకుంటారని ఇటువంటి నాయకుడు నియోజవర్గానికి దొరకడం అదృష్టమని అన్నారు. ప్రజాహక్కుల కోసం అరవింద బాబు చేసిన పోరాటాలు ఎన్నటికీ మర్చిపోలేని గత ప్రభుత్వంలో అడుగడుగునా అక్రమ కేసులు పెట్టిన ఎప్పుడు వెనకడుగు వేయలేదని కూటమి నేతలు కొనియాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కూటమి నేతలకు, కార్యకర్తలకు, నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తనతో పాటు పోరాటాలలో ఉండి కష్టపడి తమను గెలిపించిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజవర్గంలో ప్రతిరోజు అందుబాటులో ఉంటానని ఎటువంటి చిన్న సహాయం ఉన్న ఇంటి తలుపులు ఎప్పుడు తెరచే ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కోరారు.





# నా కొడుకును తాడేపల్లి పోలీసులు వేధిస్తున్నారు

- టీడీపీ గ్రీవెన్స్‌లో నేతలకు హైకోర్టు అడ్వకేట్ ఫిర్యాదు
- వివిధ సమస్యలపై టీడీపీ కార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు
- వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు పీవీజీ కుమార్, మన్నె సుబ్బారెడ్డి, మాల సురేంద్ర

**మంగళగిరి, మహానాడు:** హైకోర్టు అడ్వకేట్ జి.మాధవరాజు మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన కుమారుడి కారును మరో వ్యక్తి వెనుక నుండి ఢీకొడితే.. ఆ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే, ఢీకొన్న వారిపై చర్యలు తీసుకోక పోగా.. తిరిగి తన కొడుకును పోలీసులు వేధిస్తున్నారని.. తన కొడుకును వేధిస్తున్న తాడేపల్లి పోలీసులపై చర్యలు తీసుకోవాలని నేతలు కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి, గవర కార్పొరేషన్ చైర్మన్ మాల సురేంద్రలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

- కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికి చెందిన యాంపల్లి ఈశ్వరయ్యస్వామి గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని వేరే వారు ఆక్రమించారని.. దాన్ని కబ్జాదారుల నుండి విడిపించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.
- పల్నాడు జిల్లా క్రోసూరుకు చెందిన మల్లెల నాగేశ్వరరావు గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తాము పంట సాగ్గుచేసుకునే పట్టాలు అడ్డకు ఇచ్చుకుంటూ బతికేవాళ్లమని.. అయితే కృష్ణా జిల్లా కోడూరు మండలం విశ్వనాథపురంలో కొంత మంది రైతులు తమ పట్టాలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా పట్టాలు చినిగిపోయేలా చేశారని.. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పట్టించుకోవడం లేదని.. దయ చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.
- గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం ఎలవర్తిపాడు గ్రామానికి చెందిన షేక్ జాని బేగం విజ్ఞప్తి చేస్తూ.. గత టీడీపీ ప్రభుత్వంలో తమ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎన్‌ఆర్ఈజీఎస్ నిధుల కింద సిమెంట్ రోడ్డు పనులు చేశామని వాటికి సంబంధించిన బిల్లు రూ. 3 లక్షలకు పైగా ఇంకా తమకు రాలేదని.. దయ చేసి వాటిని ఇప్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన వెలగా జ్యోతి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. రిజిస్ట్రేషన్ అయిన తమ భూమిని ఆన్ లైన్ లో ఎక్కించి పాస్ పుస్తకాలు ఇవ్వాలని అనేక సార్లు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని.. తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
- అనకాపల్లి జిల్లా పరవాడ మండలం దేశపాత్రునిపాలెంకు చెందిన కె. రమాదేవి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. స్కూల్ జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణం ఆపాలని కోర్ట్ ఆర్డర్ ఉన్నా స్థానిక అధికారుల అండతో అక్రమ నిర్మాణం సాగుతుంది..



జరుగుతుందని.. దయ చేసి దాన్ని ఆపాలని విజ్ఞప్తి చేశారు.

- పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం ఏనుగువానిలంక గ్రామానికి చెందిన వంజమూరి నాగమణి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలో తనకు చెందిన భూమిని మరో వ్యక్తి అక్రమ రిజిస్ట్రర్ చేయించుకున్నాడని.. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు
- అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం, బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం పీఠాధిపతి శ్రీ పరవిద్యానందగిరి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన గురుపూర్వికులైన శ్రీ సర్వేశ్వరానంద స్వాముల వారి నుండి వీలునామా ద్వారా తనకు సంక్రమించిన భూమిని.. సర్వేశ్వరానంద స్వామి వారి బంధువులమని చెప్పుకొంటూ కొంత మంది వచ్చి తమపై దౌర్జన్యం చేస్తూ.. దేవాలయం తెరవనీయకుండా.. పొలంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని.. వారిపై చర్యలు తీసుకొని



తమకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

- అనంతపురం జిల్లా ఇమాంపురం గ్రామానికి చెందిన కె. కృష్ణయ్య విజ్ఞప్తిచేస్తూ.. తాను టీడీపీ పార్టీకి చెందిన వాడిని కావడంతో తనపై తప్పుడు కేసులు బనాయించారని.. దాంతో తాను ఇబ్బందుల పడుతున్నానని.. దయ చేసి తనపై పెట్టిన తప్పుడు కేసులు తొలగించేలా చూడాలని విజ్ఞప్తిచేశారు.
- నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఎస్. మల్లికార్జున రావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తాము మోచర్ల గ్రామంలో పొలం కొను గోలు చేసి వెంచర్ వేసేందుకు యత్నించగా మద్దసాని శ్రీనివాసులు అనే వ్యక్తి తమ పొలం పక్కన ఆయనకు 0.30 సెంట్లు ఉందని.. దాన్ని కూడా తమ వెంచర్ తో కలిపి అమ్మాలని చెప్పారని.. దానికి తాము అంగీకరించకపోవడంతో.. తమ పొలానికి తప్పుడు పత్రాలు సృష్టించి పోలీసులతో బెదిరిస్తున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాడు.









జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025



విజయవాడలో ఫిషరీస్ కమీషనర్ ఆఫీసులో రొయ్య రైతులతో సమావేశానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు. రాబోయే 10 రోజులకి మద్దతు ధర ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లోకల్ గా రొయ్యల వాడకం పెంపొందించటానికి చిట్టూరి సురేష్ (శ్రీనివాస హేచరీస్)సూచనలు తీసుకుకున్నారు. ఏపీఎస్ఏడిఏ ఛైర్మన్ ఆనం వెంకటరమణ రెడ్డి , ఫిషరీస్ కమిషనర్ నాయక్ , ఇతర అధికారులు, ఎక్స్పోర్టర్స్, రైతులు పాల్గొన్నారు.



## కూటమి పాలనలో అభివృద్ధి సాధ్యం

● ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు


చిత్తూరు, మహానాడు: స్థానిక రైల్వే స్టేషన్ లో జరుగుతున్న రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పరిశీలించారు. పనుల వివరాలను స్థానిక రైల్వే అధికారులు అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ కు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడొద్దని రైల్వే అధికారులకు సూచించారు. స్టేషన్ అభివృద్ధికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఆధునీకరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తిరుపతి- కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ల వల్ల చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం పురోభివృద్ధి చెందుతుంది. తిరుపతి, తిరుమల, తిరుచానూరు, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ ఆలయాలకు భక్తుల తాకిడి అధికమవుతుంది. మరీ ముఖ్యంగా వాణిజ్యపరంగా అభివృద్ధి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తాము పండించిన పంటలను సులభంగా రవాణా తీసుకునేందుకు సౌలభ్యం గా ఉంటుందని, కేంద్ర ప్రభుత్వ సహకారం.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ పల్లె తిరుపతి- కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్.. చిత్తూరు పార్లమెంటు ప్రజల చిరకాల సహకారం అయిందని తెలిపారు.

కూటమి ప్రభుత్వ హయాంలో చిత్తూరు పార్లమెంటు అన్ని రకాలగా అభివృద్ధి చెందుతుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ , పులివర్తి నాని, డాక్టర్ మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్, చిత్తూరు నగరం మేయర్ కుమారి ఆముద, చూడ చైర్పర్సన్ కఠారి హేమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, తదితరులు ఉన్నారు.

## అటవీ అభివృద్ధికి సలహాదారు నియామకం

● ఉత్తర్వులు జారీ చేసిన కూటమి సర్కారు



అమరావతి, మహానాడు: ఏపీ ప్రభుత్వం ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(రిటైర్డ్) పి.మల్లికార్జున రావును సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈయన అటవీ అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి నియమించారు. ఈయన పదవీకాలం రెండేళ్ళు ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పార్కింగ్ ఫీజు వసూలు చేయొద్దు

● నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు

విజయవాడ, మహానాడు:

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ఉత్తర్వుల మేరకు షాపింగ్ మాల్స్ లో షాపింగ్ చేసిన, సినిమా చూసిన పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మొదటి అరగంట వరకు ఎవరి దగ్గర నుండి ఎటువంటి పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని, అరగంటకు మించి గంటలోపు పార్కింగ్ చేసిన వ్యక్తి, తాను మాల్లో షాపింగ్ చేసినట్టు రుజువును బిల్లు రూపంలో సమర్పించినచో ఎటువంటి పార్కింగ్ చెల్లింపులు చెల్లించిన అవసరం లేదని వివరించారు. గంటకు పైబడి పార్కింగ్ చేసినచో షాపింగ్ చేసినా, సినిమా చూసినా, ఆ టికెట్/బిల్‌ను రుజువుగా చూపించినచో వారు పార్కింగ్ ఫీజుని చెల్లించిన అవసరం లేదని తెలిపారు. బిల్/టికెట్ చూపించనప్పుడు వారు పార్కింగ్ ఫీజు వసూలు చేయాలని కమిషనర్ సూచించారు.



పాఠశాల విద్యాశాఖ - సమగ్ర శిక్షా - వారి ఆధ్వర్యంలో సత్తెనపల్లి ఆర్డీవో ఆఫీసులో జరిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



కైకలూరు నియోజకర్గం కైకలూరులో జరిగిన కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ విస్తృతస్థాయి సమావేశం లో ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ తో కలిసి పాల్గొన్న ఏలూరు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు..



పండుగ వాతావరణంలో కొత్త రోడ్లు ప్రారంభించిన ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరావతి: వెనుకబడిన తరగతుల అభ్యున్నతే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని, గతంలో ఎన్నడూ లేనంతగా బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎన్నికల్లో బీసీలకిచ్చిన ప్రతి హామీని నెరవేరేస్తున్నామని, ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ కులాలకు చెందిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల మేలుకు సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి బీసీ కులాల అభ్యున్నతికి నిధులు కేటాయిస్తూ వస్తున్నారన్నారు. 2024-25 బడ్జెట్లో ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు రూ.39,007 కోట్లు, 2025-26 బడ్జెట్ లో బీసీలకు రూ.48 వేల కోట్లు కేటాయించారన్నారు.

ఒకవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే మరోవైపు అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయా కార్పొరేషన్ల చైర్మన్లకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందజేయాల్సిన బాధ్యత మీదేనంటే మంత్రి సవిత స్పష్టంచేశారు.. అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు.

పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారన్నారు. ఇసుకతో పాటు మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు



అందజేస్తున్నామన్నారు. త్వరలో తల్లికి వందనం, రైతు భరోసా పథకాలను కూడా అమలు చేయబోతున్నామన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందజేయనున్నామన్నారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.20 వేలు అందజేయబోతున్నామన్నారు. చేనేతలకు అందజేసే పథకాలపైనా నేతన్నలకు వివరించాలన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తున్నామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం మేర సీట్లు కేటాయింపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామన్నారు. నామినేటెడ్, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

ఈ సందర్భంగా ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు పలు సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్ర మందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన స్థాయిలో సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. మరికొన్ని సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్లు కేవలం ప్రకటనలకు, వైసీపీ నాయకులకు రాజకీయ ఉపాధి కల్పనకే పరిమిత మయ్యాయన్నారు.

సీఎం చంద్రబాబునాయుడు రాకతో బీసీ కార్పొరేషన్లకు పూర్వవైభవం వచ్చిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నందం అబద్దయ్య, వీరంకి వెంకట గురుమూర్తి, దూండి రాకేశ్, పి.విజయకుమార్, సదాశివం, ఆర్కే నాయుడు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మస్తాన్ దర్గా వక్ఫ్ పరిధిలోకి రాదు

● స్వాధీనానికి వక్ఫ్ బోర్డు నిర్ణయించడం విచారకరం : రావి దూండేస్వరీ

గుంటూరు, మహానాడు: నగరంలోని ప్రఖ్యాత మస్తాన్ దర్గాను స్వాధీనం చేసుకునేందుకు జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులు తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఈ నెల 11న దర్గాకు వచ్చిన వక్ఫ్ అధికారులు, దానిని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. ఈ విషయాన్ని దర్గా ప్రతినిధి రావి రామ్మోహన్ రావుకు తెలిపారు. అయితే, రామ్మోహన్ రావు ఈ ప్రక్రియకు కొంత గడువు కోరారు.

దీని ప్రకారం, ఈ నెల 14 వరకు సమయం ఇవ్వాలని రామ్మోహన్ రావు కోరగా, ఆ రోజున అధికారులు దర్గాకు వెళ్లినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో, మంగళవారం దర్గాను స్వాధీనం చేసుకుంటామని వక్ఫ్ అధికారులు స్పష్టం చేశారు.

మరోవైపు, దర్గా వక్ఫ్ పరిధిలోకి రాదని రావి దూండేస్వరీ పేర్కొన్నారు. 2000 సంవత్సరంలోనే జిల్లా కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చిందని ఆమె తెలిపారు.

అప్పటి నుంచి దర్గా వక్ఫ్ పరిధిలో లేదని, అందుకే పన్నులు కూడా చెల్లించడం లేదని ఆమె వివరించారు. తమకు



ముందుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే అధికారులు హఠాత్తుగా వచ్చి స్వాధీనం చేసుకుంటామని చెప్పడం సరికాదని ఆమె అన్నారు.

తాము అందుబాటులో లేకపోవడంతో 14 వరకు సమయం కోరామని, ఆ రోజున అధికారులు విజయవాడలో కలవమని చెప్పారని, అక్కడికి వెళ్లినా అధికారులు స్పందించ లేదని దూండేస్వరీ ఆవేదన వ్యక్తం చేశారు.



## నాటక రంగంలో అత్యుత్తమ సేవలకు కందుకూరి పురస్కారాలు

● రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

అమరావతి, మహానాడు:

ప్రముఖ రచయిత, సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీన నిర్వహించుకునే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారం, 26 జిల్లాలకు గానూ జిల్లా స్థాయిలో 107 మంది ప్రతిభ గల నాటక రంగ కళా కారులు, సాంకేతిక నిపుణులకు కందుకూరి విశిష్ట పురస్కారాలను అందిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాటక, సినీ రచయిత డాక్టర్ బుర్రా సాయి మాధవ్ ఛైర్మన్ గా 11 మంది నాటక రంగ ప్రముఖులతో నియమించిన ఎంపిక కమిటీ ఈ మేరకు పురస్కార గ్రహీతలను పారదర్శకంగా ఎంపిక చేసిందన్నారు.

నాటక రంగంలో కృషి చేసిన వారికి రాష్ట్రస్థాయిలో కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారంతో పాటు లక్ష రూపాయల నగదు, జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి కందుకూరి విశిష్ట పురస్కారంతో పాటు రూ. 10 వేల నగదును ఏప్రిల్ 16న సాయంత్రం 6 గం.లకు విజయ వాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అందించనున్నామన్నారు.

కళా, నాటక రంగాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించామని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రకటనలో పేర్కొన్నారు. కళాకారులు, నాటకరంగ ప్రముఖులు, సాంకేతిక నిపుణులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని వెల్లడించారు.

## 'మహానాడు-2025' విజయవంతానికి విశేష పూజలు

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి, మహానాడు:

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మహానాడు 2025ను విజయవంతం కావాలని విశేష పూజలు చేశారు. మహానాడు ప్రారంభానికి ముందు ఆయన గుజరాత్‌లోని పవిత్ర ద్వారకా నగరానికి వెళ్లి, శ్రీ ద్వారకాధీశుని ఆలయంలో విశిష్ట పూజలు చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ఆధారంగా రాష్ట్రం అభివృద్ధి, ప్రగతిపథంలో అడుగులు వేస్తున్న తరుణంలో, ఈ మహానాడు పార్టీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలవాలని, ఎలాంటి ఆటంకాలు రాకుండా విజయవంతంగా జరగాలని ఆయన స్వామివారిని ప్రార్థించారు.

రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం, 'విజన్ 2047' దిశగా సంకల్ప బద్ధంగా ముందుకెళ్తోంది. ముఖ్యంగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు విద్యాశాఖ మంత్రి, యువనేత నారా లోకేష్ తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తు తరం కోసం దోహదపడతాయని ఆయన అన్నారు.

ఈ మహానాడు ద్వారా రాష్ట్రానికి మార్గనిర్దేశకంగా నిలిచే కీలక నిర్ణయాలు తీసుకుంటామని, పార్టీని బలోపేతం చేయడమే కాకుండా ప్రజలకు మరింత సేవచేసే లక్ష్యంతో తెలుగుదేశం ముందుకెళ్తుందని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.



# ప్రజలకు కావాల్సింది ఎత్తైన భవనాలు కాదు... మంచి పరిపాలన!


● ఏపీ సీఎం చంద్రబాబు పాలనపై మాజీ మంత్రి వడ్డే కీలక వ్యాఖ్యలు

విజయవాడ, మహానాడు:

రాజధాని కోసం రైతుల నుంచి దాదాపు 34 వేల ఎకరాలు తీసుకున్నారు.. అంతకు ముందే వాగులు, కొండలు, రోడ్లు అన్నీ కలిపి దాదాపు 58 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ, పరిపాలనా వ్యవస్థలన్నింటికీ కావాల్సింది 2,700 ఎకరాలు మాత్రమే.. తాత్కాలికం పేరుతో సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలను నిర్మించారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఇప్పుడు అదనంగా మరో 44వేల ఎకరాలు తీసుకుంటామని ప్రకటించారు.. రాజధాని కోసం 31 వేల కోట్లు అప్పుచేశారు... ఇంకా 69 వేల కోట్లు అవసరమంటున్నారు. ఇలాంటి ఆలోచనలతో ఈ రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన ఇంకా, ఏమన్నారంటే..

రెండు కళ్ల సిద్ధాంతంతో పరోక్షంగా ఉమ్మడి ఏపీ విభజనకు దోహదపడ్డారు. మోదీ ప్రభుత్వం ప్రత్యేక హోదా హామీని ఎగ్గొట్టేసింది. ఏపీకి కేంద్రం అన్యాయం చేస్తున్నా చంద్రబాబు సరైన పోరాటం చేయడం లేదు. ప్రజలకు ఉపయోగపడేవి వదిలేసి అవుటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు అంటారేంటి చంద్రబాబు? హైపర్ లూప్ అనే రైలు అమెరికా, జపాన్, జర్మనీ వంటి దేశాల్లోనే లేదు. ఏపీలో హైపర్ లూప్ రైలుకు డీపీఆర్ చేయమని చెప్పడం చంద్రబాబు అనాలోచిత...తొందరపాటు చర్య! పెద్ద పెద్ద ధనవంతులకు , కార్పొరేట్లను బాగుచేయడం కోసం ఇలాంటివి చేయడం సరికాదు.

గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో పేదలను గాలికి వదిలేశారు. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్లకు మేలు జరిగేలా పనిచేస్తున్నారు. మీ నిర్ణయాల వల్ల



ప్రజలు, రైతులు, విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. 58 వేల ఎకరాలుంటే మళ్లీ 44 వేల ఎకరాలు తీసుకోవడం దేనికి? మీ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఈ 44 వేల ఎకరాలు తీసుకుంటున్నారా చంద్రబాబు?

పొలం ఉన్న రైతు అమ్ముకోలేడా... రైతు తరపున మీరు అమ్ముతారా? ప్రభుత్వం ఉన్నది...రియల్ ఎస్టేట్ వాళ్లను బాగు చేయడానికా?

### 40 అంతస్తుల బిల్డింగ్‌లు ప్రజలకు ఒరిగేదేంటి?

ప్రజలకు కావాల్సింది ఎత్తైన భవనాలు కాదు మంచి పరిపాలన! ప్రజలకు మేలు చేయకుండా మెట్రో రైలు జపం చేయడమెందుకు? ఏపీలో ఉన్న ఆరు ఎయిర్ పోర్టులు సరిపోవా... మళ్లీ కొత్తవి పెట్టడం దేనికి? అమరావతిలో 5 వేల ఎకరాల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు ఎవరడిగారు...ఎవడికి కావాలి? శ్రీకాకుళం జిల్లాలో ఎయిర్ పోర్టు కావాలని ఎవరడిగారు? శ్రీకాకుళంలో నాలుగైదు ఎకరాలున్న వాళ్లు కూడా బెజవాడలో తాపీ పనులు చేసుకుంటున్నారు? శ్రీకాకుళంలో కావాల్సింది ఎయిర్ పోర్టు కాదు.. పంటలకు సాగునీరు?

ఉద్దానంలో కిడ్నీ వ్యాధితో రోజుకొకరు చనిపోతుంటే నీకు కనిపించడం లేదా?

చంద్రబాబు ఆలోచనలో ఇప్పటికైనా మార్పు రావాలని నేను కోరుతున్నా.... పి4 గురించి తర్వాత ముందు సూపర్ సిక్స్ గురించి మాట్లాడండి చంద్రబాబు .... కేంద్రం ఇచ్చేది కాకుండా రైతులకు 14 వేలు ఇస్తామన్నారు...ఏమైపోయింది ఆ హామీ? మెట్రోరైళ్ల పై ఉన్న శ్రద్ధ రైతుల పై ఎందుకు లేదు చంద్రబాబు? కృష్ణానదిలో 4500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ కట్టడానికి మీకు అసలు బుద్ధుందా? చంద్రబాబు

పి4 విధానం అంటున్నారు మంచిదే.... డబ్బున్నవాళ్లు పేదలకు సాయం చేయడం ఈరోజు కొత్తగా వచ్చింది కాదు.. రాష్ట్రంలోనే అతిపెద్దవైన మూడు విద్యాసంస్థలు మీ నాయకులవే.... మీకు చేతనైతే నారాయణ, భాష్యం విద్యాసంస్థల్లో పది శాతం పేద విద్యార్థులకు సీట్లు ఇప్పించండి. పేదల కోసం హెరిటేజ్ నుంచి మీరేమీ ఇవ్వరా...? మీ హెరిటేజ్ నుంచి మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పాలు...పెరుగు..మజ్జిగ ప్యాకెట్లైనా ఇవ్వొచ్చు కదా? పేదల కోసం హెరిటేజ్ కూడా మేలు చేస్తుందని ప్రజలకు తెలియజేయండి. మీరు చేస్తే మిమ్మల్ని చూసి మరికొంతమంది సాయం చేసేందుకు ముందుకు వస్తారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025 ||



ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకాదినకర్ కాకినాడ జిల్లాలో "కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాల పైన జిల్లా కలెక్టర్ ఎస్. షాన్ మోహన్ సమన్వయంతో సమీక్ష " చేశారు. శాసనసభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్పగా, శాసన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ మరియు వివిధ శాఖల అధికారులు ఈ సమీక్ష కు హాజరయ్యారు.



# అలిపిరిలోనే వసతి, కౌంటర్లు!

- ఇక బస్సుల్లోనే కొండపైకి...
- టీటీడీ కీలక నిర్ణయాలు

**తిరుమల, మహానాడు:** తిరుమలకు వచ్చే భక్తుల కోసం టీటీడీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. శ్రీవారి దర్శనంలో ఏఐ సాంకేతికత వినియోగానికి రంగం సిద్ధమైంది. ఇందు కోసం ప్రతీ భక్తుడికి శాశ్వత ఐడీ ఇవ్వనున్నారు. ఇదే సమయంలో తిరుమల విజన్-2047 అమలు దిశగా కార్యాచరణ సిద్ధమవుతోంది. అందులో భాగంగా అలిపిరి వద్దే బేస్ క్యాంప్ ఏర్పాటుకు నిర్ణయించారు. 15 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళికలు రెడీ అయ్యాయి. అలిపిరి వద్దే ప్రయివేటు వాహనాలను నిలిపి ఎలక్ట్రిక్ బస్సుల్లో కొండ పైకి తీసుకెళ్లనున్నారు. అలిపిరి వద్దే వసతితో పాటుగా అన్ని కౌంటర్ల ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది.

## అలిపిరి వద్ద బేస్ క్యాంపు

తిరుమలకు వచ్చే భక్తుల కోసం టీటీడీ మరో ప్లాన్ అమలు చేయనుంది. అలిపిరి వద్ద బేస్ క్యాంపు ఏర్పాటుకు ప్రణాళికలు ఖరారయ్యాయి. అలిపిరి వద్దే భక్తులకు వసతితో పాటుగా అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నారు. దీని ద్వారా దర్శనం కోసం వెళ్లే భక్తులు అన్ని రకాల సేవలు అలిపిరిలోనే పొందే అవకాశం కలుగుతుంది. తిరుమలలో పెరిగిపోతున్న వాహనాల రద్దీ తగ్గించేందుకు వీలుగా కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నారు. భక్తులకు సౌకర్యాలతో పాటుగా వాహన రద్దీ, కాలుష్యం తగ్గించేలా బేస్ క్యాంపులో సౌకర్యాలు కల్పిస్తున్నారు. సైలెంట్ జోన్‌లో ఉండాల్సిన తిరుమల కమర్షియల్ జోన్‌లోకి వెళ్లిపోయింది. తిరుమలలో రోజుకు సగటున 68 వేల మంది భక్తులతో పాటు 20 వేల మంది స్థానికులకు నీటి, విద్యుత్ వనరులు సమకూర్చడం కూడా కష్టంగా మారుతోంది.

## అన్ని వసతులతో ఏర్పాటు

తిరుమలకు వచ్చే భక్తుల కోసం ప్రధానంగా తిరుమలలో 7,790 టీటీడీ గదులు, 1,105 మఠా ల గదులు, 6,800 లాకర్లు ఉన్నాయి. వీటి ద్వారా కేవలం 55 వేల మందికి మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంటోంది. మిగిలిన భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సవాళ్లను ఎదుర్కోవడం కోసమే టీటీడీ బేస్‌క్యాంప్ ప్రాజెక్ట్‌పై ప్రధాన దృష్టిసారించింది. తిరుమల విజన్- 2047లో భాగంగా అలిపిరిలో బేస్‌క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని భావించి ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్ట్‌ను సిద్ధం చేశారు. దీనికోసం 10 నుంచి 15 హెక్టార్ల స్థలాన్ని వినియోగించనున్నారు. గతంలో వివిధ హోటళ్లకు ఇచ్చిన స్థలాన్ని కూడా రద్దు చేసి టీటీడీకే కేటాయించడంతో బేస్‌క్యాంప్‌కు లైన్ క్లియర్ అయింది. ఇటీవల టీటీడీపై సమీక్షలో ఈబేస్ క్యాంప్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు నుంచీ గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఇక పనులు వేగంవంతంగా పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

## బేస్‌క్యాంప్‌లో ఏముంటాయి..

25 వేల మంది భక్తులకు సకల సౌకర్యాలతో వసతి కల్పించేదిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి చేరే ప్రైవేట్ వాహనాలను ఈ బేస్‌క్యాంప్‌కు మళ్లించి వాటిలో వచ్చిన భక్తులను టీటీడీ, ఏపీఎస్‌ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా తిరుమలకు పంపేందుకు ప్రత్యేక కేంద్రం.. మోడల్ ట్రాన్స్‌ఫర్ టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు, స్నానాలు చేసేందుకు, భోజనం హాళ్లు, లాకర్లు వంటి సదుపాయాలు కల్పిస్తారు.

ఇక, భక్తులకు వసతి కేటాయింపు కార్యాలయాలతో పాటు వివిధ రకాల కౌంటర్లను ఇక్కడ ఏర్పాటు చేస్తారు. మ్యూజియం, కళాప్రదర్శన కేంద్రం, ఆధ్యాత్మికతను పెంచేలా వివిధ రకాల ఏర్పాటు ఉంటాయి.

కొండపై వాహన కాలుష్యం తగ్గించడంతో పాటు నీటి, విద్యుత్ వినియోగాన్ని సమర్థంగా నిర్వహించే అవకాశం కలుగుతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుంది. దీంతో, సాధ్యమైనంత త్వరగా ఈ బేస్ క్యాంపు అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు సాగుతున్నాయి.

# బీసీ రిజర్వేషన్లు ,ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ

- ఈ అంశాన్ని తీసుకొని ప్రజల్లో పెద్ద ఎత్తున పార్టీ నేతలు కార్యక్రమాలు నిర్వహించాలి
- నోవాటెల్‌లో సీఎల్పీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్:** కుల గణన దాని తరువాత జరిగిన ప్రక్రియ సబ్ కమిటీ,బీసీ డెడికేటెడ్ కమిషన్ కేబినెట్ అప్రూవల్ సభలో యాక్ట్ 2,3 ద్వారా బీసీ లకు 42 శాతం స్థానిక సంస్థలు,విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి గవర్నర్ దగ్గరకు పంపడం జరిగింది. ఈనెల ఏప్రిల్ 8 న ఆమోదం పొందింది. గవర్నర్‌కి ధన్యవాదాలు



బీసీల రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళింది. ఇటీవల సుప్రీంకోర్టు కూడా రెండు నెలల్లో విషయాన్ని తేల్చాలని చెప్పింది. తప్పకుండా సాను కూలంగా తీర్పు వస్తుంది. శాసన సభలో బీసీల రిజర్వేషన్ల పై అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. కుల గణన సర్వే ప్రామాణికంగా సమాచారాన్ని లక్ష మంది ఉద్యోగుల ద్వారా చేయడం జరిగింది..

న్యాయ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సమాచార సేకరణ జరిగింది. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో బీసీ ల నాయకులు ,కుల సంఘాల నాయకులు ,ఉద్యోగ సంఘాల నాయకులు ,బీసీ మేధావులను పిలిచి చారిత్రాత్మక ప్రక్రియ 1931 స్వాతంత్ర్య ఉద్యమ తరువాత జరిగిన కుల సర్వే మళ్ళీ ఇప్పుడు మాత్రమే జరిగిందని ప్రజలకు అవగాహన కల్పించాలి

ఈ అంశాన్ని సానుకూలంగా పార్టీ పరంగా ప్రజలంతా మనవైపు చూసేలా కార్యక్రమాలు నిర్వహించాలని శాసన సభ్యులు ,మండలి సభ్యులు , పార్లమెంట్ సభ్యులకు కోరడం జరిగింది. దేశంలోనే బీసీ ల రిజర్వేషన్లు ,ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది రాహుల్ గాంధీ గారు దీనిని ప్రశంసించారు. ఈ అంశాన్ని తీసుకొని ప్రజల్లో పెద్ద ఎత్తున పార్టీ నేతలు కార్యక్రమాలు నిర్వహించాలి.

# అంబేద్కర్, రాజీవ్‌ల మూలంగా మహిళలకు విశిష్ట అధికారాలు

- గ్రీన్ పవర్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం
- మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం
- స్త్రీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్:** ఈ దేశంలో మహిళలకు విశిష్ట అధికారాలు, హక్కులు, రాజకీయాల్లో వాటాకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ లే పునాదులు వేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం హైదరాబాద్ తాజ్ డెక్కన్ లో జరిగిన స్త్రీ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

మన దేశంలో బాల్యవివాహాలు, వరకట్నం నిషేధం, మహిళలకు ఓటు హక్కు, విడాకులు, మహిళలకు ఆస్తిలో వాటా వంటి చట్టాలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హిందూ కోడ్ బిల్ ద్వారానే ఆచరణలోకి వచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల్లో 33% మహిళలకు రిజర్వేషన్ను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు.

ఈ చర్యల మూలంగా మహిళలు ఎన్నికలు, పరిపాలన రంగంలోకి ప్రవేశించారని తెలిపారు. రాష్ట్రంలోనీ ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం




లక్ష్యానికి మించి 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశామని తెలిపారు. రాబోయే నాలుగు సంవత్సరాలు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు అందజేస్తామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రీన్ పవర్ పాలసీలో మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. సోలార్ ఉత్పత్తి రంగాల్లోకి వారిని తీసుకు వస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

విద్యుత్ శాఖ, ప్రభుత్వంలోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం అయితే పెద్ద ఎత్తున వారితో సోలార్ ఉత్పత్తి చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి, ఖాళీ స్థలాలు ప్రభుత్వమే లీజుకు ఇచ్చి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కుర్చున్నామని వివరించారు.

మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకు ఆర్టీసీ బస్సులో రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ఈ సౌకర్యం ద్వారా మహిళలు హాస్టల్లోనే పిల్లలను చూసేందుకు, మార్కెట్లు, దేవాలయాలను స్వేచ్ఛగా సందర్శించేందుకు అవకాశం ఏర్పడిందని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రంలో విజయవంతం అయిందని వివరించారు.

బ్యాంకు రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలతో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి లీజుకు ఇచ్చి ఆర్థికంగా ప్రయోజనం పొందే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు.

వీటితోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు అన్నిటిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇందిరాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇచ్చాము దీని ద్వారా వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు.

ఆధునిక యుగంలోనూ నేటికీ బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు కొనసాగుతున్నాయి ఈ అంశంపై సమాజం మొత్తం ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం కోరారు. స్త్రీ సమ్మిట్ వంటి కార్యక్రమాలు ప్రజలను సన్మార్గంలో నడపడానికి ప్రభుత్వాలు సరైన చట్టాలు తెచ్చేందుకు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.




# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ.20.19 కోట్లు విడుదల

- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్:** బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ.20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిం దని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు.

నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు.

బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ ఎఫ్ టికి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజక వర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీకి రక్షణ కవచం బి.జె.పి

- కాంగ్రెస్ పార్టీనీ నిందిస్తే బి.జె.పీకి నొప్పి పుడుతుంది.
- బి.జె.పి,కాంగ్రెస్ పార్టీల చీకటి స్నేహం.
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన రేవంత్ రెడ్డి తెలంగాణ ముద్దుబిడ్డానా?
- గోపాల్‌పేట మండల రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**గోపాల్‌పేట:** ఏప్రిల్ 27న వరంగల్ నందు జరగబోవు రజతోత్సవ సన్నాహక సమావేశం ఈరోజు గోపాల్ పేట మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు బి.బాలరాజు అధ్యక్షతన జరిగింది. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి అండ కె.సి.ఆర్ గులాబీ జెండా అని.. బి.జె.పి,కాంగ్రెస్ పార్టీలు చీకటి స్నేహం చేస్తూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు.పాలమూరు ముద్దుబిడ్డను అని చెప్పుకొనే రేవంత్ రెడ్డి కేవలం 600కోట్లు ఖర్చు పెడితే 12లక్షల ఎకరాలకు సాగు నీళ్ళు ఇవ్వవచ్చని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ ఏర్పాటులో నిబంధనలు పాటించకుండా కాంగ్రెస్ ఆర్భాటం చేస్తున్నారు.మండలం లో మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలంటే ప్రాథమిక నోటిఫికేషన్ ఇస్తారు. దాని తర్వాత తుది నోటిఫికేషన్ తర్వాత గెజిట్ వస్తుంది. ఈ నిబంధనలు పాటించకుండా ప్రజలను మభ్యపెట్టడానికి శంకుస్థాన చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాలలో విఫలమైందని కరెంట్ కోతలు,సాగు నీళ్ళు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులకు రుణమాఫీ లేదని,రైతు భరోసా లేదని,రైతు బీమా లేదని,యువకులకు 2లక్షల ఉద్యోగాలు లేవని,మహిళలకు 2500లేవని,తులం బంగారం లేదని,రైతు కూలీలకు 12000 లేవని,

రియల్ ఎస్టేట్ కుదేలు అయిందని భూముల ధరలు సగానికి పడిపోయాయని జీవనాధారం కోల్పోయి రియల్టర్స్,మధ్యవర్తులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాలలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కె.సి.ఆర్ రజతోత్సవ సభకు సంకల్పించారని లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచారు.

# బీసీ కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ నిశ్శబ్ద విప్లవాలు

- వీటి ఫలితాలను కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- సీఎల్పీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాం.. కాంగ్రెస్ మంచిగా చేస్తుందని లబ్ధిదారులు అనుకుంటున్నారు. 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, 56 వేలకు పైబడి ప్రభుత్వ ఉద్యోగాలు, 8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం, సన్న ధాన్యంకు రూ. 500ల బోనస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లెక్కలేనని చేస్తున్నాము.

సంక్షేమం ఒక ఎత్తు అయితే.. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన పకడ్బందీగా పూర్తి చేశాం. ఈ రెండు అంశాలు గత కొన్ని దశాబ్దాలుగా గొప్ప గొప్ప నాయకులే చేయలేకపోయారు మన ప్రభుత్వం ధీరోదాతంగా అందరికీ చెప్పి చేసింది

ఈ రెండు అంశాలు చేయాలని ఇప్పుడు దేశవ్యాప్తంగా డిమాండ్ మొదలవుతుంది ఎన్నికల ముందు మన ప్రియతమ నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ఆమోదించాము. ఎస్సీ కుల వర్గీకరణ జరిగింది. దేశంలో కొద్దిమందికి ఇష్టం లేకపోయినా, భూసంస్కరణలు వంటి గొప్ప నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ గతంలో చేపట్టింది. అందుకే ఈ దేశంలో సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ అధికారంలో కొనసాగింది

బీసీ కుల గణన, %ంఎ% వర్గీకరణ పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బి ఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న



బిజెపి పార్టీలను మూట కట్టి మూలన పడేసే విషయాలు.. ఇవి వారి అస్తిత్వానికే ప్రమాదం కాబట్టి బీఆర్ఎస్, బిజెపి చేతులు కలిపి ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు చిత్రీకరిస్తున్నారు.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని భావించి కంచ గచ్చిబౌలిలో ఏనుగులు, పులులు తిరుగుతున్నట్టు బిజెపి, బీఆర్ఎస్ కలిసి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ని ఉపయోగించి కుట్రలు చేస్తున్నాయి. బీసీ కుల సర్వే మీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. ఏకంకండి, మాతో కలిసి రండి అని చెప్పి బహుజన వర్గాలను చైతన్యం చేయాలి. కులగణన ద్వారా పొందాల్సిన ఫలితాలను అందుకున్నాము. సంక్షేమ పథకాలు, బీసీ కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ నిశ్శబ్ద విప్లవాలు. వీటి ఫలితాలను కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి.



కొత్తపేట - ప్రసాద్ నగరంలిలోని ప్రాథమిక పాఠశాల యందు నూతనంగా నిర్మించిన యార్లగడ్డ శ్రీహరి కళావేదిక ప్రారంభోత్సవం చేసిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు..



యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో వేములకొండ లక్ష్మి నర్సింహస్వామి ఆలయం నుండి యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదాల వరకు జరిగే పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, డా.గాదరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్ .

# ఉపాధి కార్మికులకూ జీతాలివ్వకపోవడం సిగ్గుచేటు

- ఉపాధి హామీ కూలీల జీతాలను ఎవరి ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు?
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్

**హైదరాబాద్:** మహాత్మా గాంధీ పేరుతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుం డటం సిగ్గుచేటు. ఉపాధి కూలీలు సహా, ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఏపీఓలకు, సీఓలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయం.చేసిన పనికి వేతనాలు రాక ఉపాధి కూలీలు, సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, పస్తులతో కాలం వెల్లదీస్తుంటే ఈ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం.



మంత్రులకు, అధికారులను కలిసి ఎన్నిసార్లు గోడు వెళ్లబోసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోవడం సోకాల్డ్ ప్రజాపాలన వైఫల్యానికి నిదర్శనం. జీతాల చెల్లింపుల విషయంలో సీఎం, మంత్రులు చెబుతున్న మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన ఉండటం లేదనడానికి ఇది మరో ఉదాహరణ. జీతాలు పెండింగ్‌లో పెట్టి, రొటేషన్ చేస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్నామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి గారూ.. ఉపాధి హామీ కూలీల జీతాలను ఎవరి ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు? ఉపాధి పథకం ఉద్యోగులకు తక్షణమే వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అభయ హస్తం మేనిఫెస్టోలో చెప్పి ఏడాదిన్నర కావస్తున్నది. అన్ని హామీలు వలె దీనికి దిక్కు లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారు? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధి కూలీలు, ఉద్యోగులకు మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

08

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025 ||





## చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యం..

- రాజవోలు గ్రామంలో హై స్కూల్‌నందు బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం:** విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని, విద్యార్థులు క్రీడా రంగంలో బాగా రాణించాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఈరోజు రాజవోలు గ్రామంలో స్థానిక హై స్కూల్ నందు కీ. శే గోరంట్ల శాంతారాం వారి జ్ఞాపకార్థం జి.ఎస్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2లక్షల 50వేల రూపాయలతో నూతనంగా నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టును రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్‌తో కలిసి ప్రారంభించారు.

ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్య వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని, విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించుకుంటూ అనేక నూతన విషయాలు తెలుసుకోవాలని, తమ సోదరుడు కీ. శే గోరంట్ల శాంతారాం పేరుతో వారి కుమారుడు గోరంట్ల రవి రామ్ కిరణ్ బాస్కెట్ బాల్ కోర్టును చాలా సుందర వనంగా తీర్చిదిద్దారని తెలిపారు.

పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ తమ పిల్లలు క్రీడల్లో బాగా రాణిస్తున్నారని, ఈ ప్రాంగణంలో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు జరిగే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే గోరంట్లను కోరారు. అలాగే అడిగిన వెంటనే తమ సొంత నిధులు కేటాయించి బాస్కెట్ బాల్ కోర్ట్ ఏర్పాటు చేసిన డాక్టర్ గోరంట్ల రవిరాం కిరణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మార్ని వాసుదేవ్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, స్కూల్ హెచ్ఎం పి.రమాదేవి, నిమ్మలపూడి రామకృష్ణ, కురుకూరి కిషోర్, వల్లేపల్లి శ్రీరామ్ చౌదరి, గాలి వెంకటేశ్వరరావు, చాపల వెంకటరావు,

## మదమంచిపాడు తిరునాళ్లకు పగడ్బందీగా ఏర్పాట్లు

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:**

మదమంచిపాడు వీరాంజనేయులు స్వామివారి తిరునాళ్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది, అసౌక ర్యానికి తావులేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కాబోతున్న తిరునాళ్లపై మంగళవారం వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యమన్నారు. ఎండ తీవ్రతకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్, దేవాదాయ శాఖ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ తరఫున రూ.20 కే ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడే ఉండి అన్నీ పర్యవేక్షిస్తారన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది 24 గంటలు మూడు షిఫ్టుల్లో అన్ని అత్యవసర సేవలు, మందులతో అందుబాటులో ఉంటారన్నారు. పంచాయతీరాజ్ సిబ్బంది పారిశుద్ధ్యం పనులు చూస్తారని... మొత్తం



ఏర్పాట్లను తహశీల్దార్ సమన్వయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ నాయక్, దేవాదాయ శాఖ సుధాకర్ రెడ్డి, ఫైర్ స్టేషన్ నాగేశ్వరరావు, ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు, సీఐ శోభన్ బాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏవియేషన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతాం

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

**అమరావతి, మహానాడు:**

ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దే విధంగా ముఖ్యమంత్రి



చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.. నేడు రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గతంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వెనుకంజ వేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సైతం పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ కు తరలి వస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు మందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పెట్టుబడుదారులకు భరోసా ఇచ్చారు. ఆసక్తి ఉన్న ఔత్సాహిక పెట్టుబడుదారులు, పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరారు. మంగళవారం మాగ్నం వింగ్స్ సీఈవో అభిరామ్ చావా, అరిస్టాటిల్ ఏవియేషన్ అకాడమీ డైరెక్టర్ కెప్టెన్ శిరీష్, ఈ ప్లెయిన్ కంపెనీ డైరెక్టర్ కెప్టెన్ దివ్య, భారత్ ఏవియేషన్ డైరెక్టర్ జోసఫ్ పొన్నుస్వామి దాస్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## ఎంబిబియస్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీయింగ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

- డిఎంఇని ఆదేశించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, మహానాడు:** విజయవాడ ప్రభుత్వ సిద్దార్ధ మెడికల్ కాలేజీలో ఎంబిబియస్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీయింగ్ జరిగిన ఘటన పట్ల వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి లోతైన విచారణ జరిపి సమగ్రమైన నివేదికను అందజేయాలని డిఎంఇ డాక్టర్ నరసింహంను మంత్రి ఆదేశించారు. ఈ ఘటనకు దారితీసిన వ్యవస్థాగత, వ్యక్తిగత లోపాలపై దృష్టి సారించి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యల్ని తీసుకునే దిశగా నివేదిక ఉండాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.




## ఆంధ్రా టు ఆంధ్రా వయా తెలంగాణ.. బాధాకరమే...!




- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ పరిపాలన రాజధాని అమరావతి చేరాలంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి రావడం బాధాకరం... ఉదయం ఎనిమిది గంటలకు విశాఖ ఎయిర్ పోర్టు వచ్చిన నేను విమానంలో హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు చేరి అక్కడి నుంచి విజయవాడ విమానం క్యాచ్ చేసి గన్నవరం ఎయిర్ పోర్టులో దిగేసరికి మధ్యాహ్నం 1 గంట అయ్యిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సాయంత్రం సమావేశం కావడానికి విశాఖ నుంచి బయలుదేరిన సీఐఐ, ఫిక్కీ వంటి ట్రేడ్ ప్రతినిధులు కూడా నాలానే హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరారు. విశాఖ - విజయవాడ మధ్య ఉదయం వేళల్లో నడిచే రెండు విమానాలు రద్దు చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. దురదృష్టవశాత్తు ఈరోజు మంగళవారం కావడంతో వందేభారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారి విజయవాడ చేరాల్సి వచ్చింది. ఇది విశాఖ విమాన ప్రయాణికుల దుస్థితి అని గంటా శ్రీనివాస రావు విచారం వ్యక్తం చేశారు.

### జీసీసీలకు హబ్‌గా

## హైదరాబాద్

- 2030 నాటికి 200 మి.చ.అ. కమర్షియల్ స్పేస్
- అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం
- "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్:** హైదరాబాద్ లో 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల "గ్రేడ్ ఏ" కమర్షియల్ స్పేస్ ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నానక్ రాంగూడలో యూఎస్ కు చెందిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్" ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్" గా మారిందని... అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ పెరిగిందన్నారు. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ తగ్గుతుంటే మన దగ్గర గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదయ్యిందన్నారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్ ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయన్నారు.

హైదరాబాద్ లో అమెజాన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియంట్, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలుండగా... 3 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలో 70 కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్ లో ప్రారంభమయ్యాయన్నారు.

హైదరాబాద్ ను జీసీసీలకు హబ్ గా మార్చడమే కాకుండా...




వాటిని ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ తదితర అంశాల్లో సేవలు అందించే గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి.. యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే పనిగట్టుకొని పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయినా... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని... వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. తమ జీసీసీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వేయి మంది ఐటీ, డేటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని... రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు.

కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ ఎంటర్ప్రైజ్ టెక్నాలజీ, సెక్యూరిటీ మైకెల్, కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ - అమెరికా సూర్య గుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.

## ఎవరి ప్రయోజనాల కోసం మళ్లీ భూసేకరణ?

- అమరావతిలో మరో 44 వేల ఎకరాలు సేకరిస్తున్నారు
- గన్నవరంలో ఉండగా మళ్లీ ఇక్కడ విమానాశ్రయం ఎందుకు?
- ప్రభుత్వ విద్యాసంస్థలను బాగుచేయకుండా ప్రైవేటుకు భూములా?
- బీఎస్పీ ఏపీ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచందర్ రావు మండిపాటు

**హైదరాబాద్, మహానాడు:**

అమరావతిలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం కడతామంటూ, ఇప్పుడు ఏకంగా 44 వేల ఎకరాల భూసేకరణకు ఏపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని, ఇది రైతుల ప్రయోజనాలకు శరాఘాతమని బీఎస్పీ ఏపీ సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచందర్ రావు మండిపడ్డారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

"కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే మళ్లీ భూసేకరణ చేస్తున్నారు. రైతుల అతి ముఖ్యమైన సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఉన్న భూమిని సమర్థవంతంగా అభివృద్ధి చేస్తే, దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న 288 మంది రైతులకు లాభం కలుగుతుంది. ప్రభుత్వం కార్పొరేట్ అవసరాలపై దృష్టి పెడుతూ, రైతుల భవిష్యత్తును పూర్తిగా విస్మరించడం బాధాకరం. ప్రభుత్వం తీసుకున్న 60 వేల ఎకరాల భూమిని రైతులకు తిరిగి ఇవ్వాలని, మళ్లీ రాజధాని అమరావతికే పరిమితం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

వ్యవస్థలను బాగు చేస్తారని పాలకులను ఎన్నుకుంటే, వాళ్లు మరింత అవస్థల పాలు చేస్తున్నారు. ప్రభుత్వం తమకు నమ్మకమైన పత్రికకు ఒక లీక్ ఇచ్చింది. అందుకే కనీసం కొన్ని విషయాలు తెలుస్తున్నాయి. అమరావతికి ఇప్పటికే 54 వేల ఎకరాల భూమి ఉంది. అది చాలదన్నట్లు మరో 44 వేల ఎకరాలు సేకరిస్తున్నారు. ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, దానికి 5-7వేల ఎకరాలు కావాలట. విజయవాడ, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాలున్నాయి. భోగాపురంలో 2,700 ఎకరాల్లోనే కడుతున్నారు. మరి ఇక్కడ 5-7 వేల ఎకరాలు




ఎందుకు? ఇదంతా చూస్తే పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుంది. హైదరాబాద్‌లో 5,200 ఎకరాల్లో విమానాశ్రయం ఉంటే, అందులో వాడుతున్నది 750 ఎకరాలు మాత్రమే. అందులోనే టెర్మినల్స్ అన్నీ ఉన్నాయి. 2.8 కోట్ల మంది ప్రయాణికులు దీన్ని వాడుతున్నారు. వీరు కాక 4.2 కోట్ల మందికి సరిపడగా ఆ విమానాశ్రయం ఉంది. అమరావతిలో 2 కోట్ల మంది ప్రయాణికులు రావాలన్నా కనీసం 40 సంవత్సరాలు పడుతుంది. మరి అమరావతి విమానాశ్రయానికి 5-7వేల ఎకరాలు ఎందుకు? పక్కనే ఉన్న గన్నవరం విమానాశ్రయాన్ని విస్తరిస్తే సరిపోతుంది కదా? హైదరాబాద్‌ను మించిన స్థాయిలో కట్టాలని చూస్తున్నారు. ఇన్నివేల ఎకరాలు తీసుకుంటే రైతులంతా ఏమైపోతారు? ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మాజీ డైరెక్టర్ వందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం

- పర్యావరణ శాస్త్రవేత్తలు

**గుంటూరు, మహానాడు:** తెలుగు రాష్ట్రాలలో బహుళ ప్రయోజనాలను అందిస్తున్న కోనో కార్పస్ మొక్కలను రక్షించుకుందామని ప్రముఖ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ ఎ.ఆర్. రెడ్డి, సిసిఎంబి పూర్వ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. మోహన్ రావు, జన విజ్ఞాన వేదిక పూర్వ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ఉస్మానియా యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, జన చైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, జీవ శాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ పేర్కొన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం అనే అంశంపై మీడియా సమావేశం వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షతన జరిగింది.

ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, యోగివేమన విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ కోనోకార్పస్ మొక్కపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధనలు జరిపిన ప్రొఫెసర్ ఎ.ఆర్ రెడ్డి ప్రసంగిస్తూ మొక్కలన్నిటిలో అత్యధిక కార్బన్ డై ఆక్సైడ్ ను తీసుకొని అత్యధిక ఆక్సిజన్ ను అందిస్తున్న




మొక్క కోనోకార్పస్ అని తన పరిశోధనలో తేలిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోనోకార్పస్‌పై జరిపిన పరిశోధనలన్నీ మంచి ప్రయోజనాలున్నాయని పేర్కొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ బి.యన్. రెడ్డి, జీవశాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ, వి.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## మత కలహాలే లక్ష్యంగా వైసీపీ కుట్ర!

- గతంలో పింక్ డైమండ్‌పైనా దుష్ప్రచారం
- పాస్టర్ ప్రవీణ్ మృతిపైనా తప్పుడు ప్రచారం
- టీటీడీపై బురదజల్లేందుకు నిత్యం విషప్రచారం
- శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు కుయుక్తులు
- తిరుపతి లడ్డూ విషయంలో సిట్ విచారణ పూర్తి చేయగానే బాధ్యులపై చర్యలు
- మంత్రి మండలి సమావేశం అనంతరం మీడియాతో హోంమంత్రి అనిత

**అమరావతి, మహానాడు:**




మత కలహాలు సృష్టించడమే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు కుయుక్తులకు దిగుతోందని ఆమె స్పష్టం చేశారు. అందులో భాగంగానే పాస్టర్ ప్రవీణ్ ప్రమాదంలో మృతి చెందినా హత్యగా చిత్రీకరించేందుకు తప్పుడు ప్రచారం చేశారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై బురదజల్లేందుకు నిత్యం విషప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో పింక్ డైమండ్‌పైనా ఇలాగే దుష్ప్ర చారం చేసిన విషయాన్ని హోంమంత్రి అనిత ఈ సందర్భంగా ప్రస్తా వించారు. ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ స్వయంగా పింక్ డైమండ్ లేదని తేల్చి చెప్పినా విషప్రచారం చేశారని హోంమంత్రి పేర్కొన్నారు. ఇటీవల నరసన్నపేటలోని ఆలయ సమీపంలో జీసస్ వాక్యాలు రాయించడం.. చర్చి దగ్గర జై శ్రీరామ్ అని రాయించడం వైసీపీ కుట్రే అన్నారు.

తిరుమల అనేది పవిత్ర స్థలం.. సున్నితమైన అంశం కావడంతో వైఎస్ఆర్సీపీ నాయకులు టీటీడీ కేంద్రంగా విష ప్రచారాలు చేస్తున్నారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా గతంలో పనిచేసిన వ్యక్తి అయి ఉండి కూడా రాజకీయాలు చేస్తుండడం దుర్మార్గమన్నారు. టీటీడీ, గోశాలపై ఈవో శ్యామలారావు నిజాలు వెల్లడించారన్నారు. టీటీడీపై బురదజల్లి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే ప్రయత్నాలు సాగనివ్వబోమన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో సిట్ విచారణ పూర్తి చేస్తామన్నారు. నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పు చేసిన వారు తప్పించుకోలేరు..శిక్ష అనుభవించక తప్పదని హోంమంత్రి తెలిపారు. అనంతపురం హెలికాప్టర్ ఘటనపైనా అలాగే అబద్ధాలు చెప్పి అసత్య కథనాలు రాశారని హోంమంత్రి స్పష్టం చేశారు. 1100 మందితో జగన్ మోహన్ రెడ్డికి భద్రత కల్పించామని తాను చెబితే బలగాల మోహరింపు అని సాక్షి రాసిన ఉదంతాన్ని ఉదహరించారు.


జగన్ లాంటి ఒక క్రిమినల్ రాజకీయాల్లో ఉంటే ఎలా ఉంటుందనడానికి జరుగుతున్న పరిణామాలే నిదర్శనన్నారు. జగన్ గ్యాంగ్ అరాచకాలను ఎదుర్కొని నిజాలు ప్రజల ముందుం చేందుకు అప్రమత్తంగా ఉన్నామన్నారు. ఫ్యాక్షన్, నక్సలైట్ల సమస్యను ప్రక్షాళన చేసిన చంద్రబాబునాయుడుకు మతఘర్షణలు నిర్మూలించడం పెద్ద విషయం కాదని హోంమంత్రి అనిత అన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణను మంత్రి మండలి ఆమోదించినట్టు హోంమంత్రి అనిత వెల్లడించారు. సమాన, స్వేచ్ఛ హక్కులు, అవకాశాలను కల్పించమే ప్రభుత్వం లక్ష్యమ న్నారు. రెల్లి కులస్తులకు కూడా ఒక శాతం రిజర్వేషన్ కల్పించినట్టు పేర్కొన్నారు. అన్ని ఉపకులాలకు సమాన అవకాశాలు కల్పించడం కోసం 2011 జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కొత్త జనాభా లెక్కలు వస్తే తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.

పవన్ కల్యాణ్ పర్యటన వల్ల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ హాజరు కాలేకపోవడం అన్నది ఆరోపణ మాత్రమేనని మరోసారి హోంమంత్రి అనిత మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. విద్యార్థుల సెల్ ఫోన్‌లను ట్రాక్ చేసి, టవర్ డంప్ తో వాస్తవాలను ఆధారాలతో సహా విశాఖ సీపీ బాగ్చీ తేల్చారన్నారు.

ఎక్కడ ఏ నేరం జరిగినా గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నట్లు హోంమంత్రి స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే నేరాలు పెరగలేదని, పైగా టెక్నాలజీ సాయంతో నేరస్తులను పట్టుకునే సమయం చాలా తగ్గిందన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
09
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 16, ఏప్రిల్ 2025 ‖



## పర్యాటక మంత్రిని కలిసిన జర్నలిస్టు నాయకులు

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు విజయ్ అన్నపరెడ్డి, సెక్రటేరియట్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజా రమేష్, జర్నలిస్టు నాయకులు రవికాంత్ & చెవుల శ్రీనివాస్.. ఆంధ్రప్రదేశ్ పర్యాటక మరియు చలన చిత్ర పరిశ్రమ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి జర్నలిస్ట్ సావనీర్ అందచేశారు.

## జగన్‌ను తీసుకువెళ్ళిన
# పైలట్, కో పైలట్‌కు నోటీసులు

- హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతింటే టేకాఫ్ ఎలా చేశారని కోరిన పోలీసులు
- నేడు విచారణకు హాజరుకండి

**అమరావతి, మహానాడు:** జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటన వివాదస్పదమైన సంగతి తెలిసిందే. జగన్ అభిమానుల మితిమీరి ప్రవర్తించడంతో హెలికాప్టర్ దెబ్బతిన్నది. దీంతో జగన్ రోడ్డు మార్గాన వెళ్ళిపోయారు. అయితే, హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతింటే హెలికాప్టర్‌ను ఏ విధంగా టేకాఫ్ చేశారని.. డెస్టినేషన్ పాయింట్‌కు వెళ్లకుండా హెలికాప్టర్‌ను ఎక్కడికి తీసుకెళ్లారనే కోణంలో సీకే పల్లి పోలీసులు విచారణ మొదలు పెట్టారు. ఇందులో భాగంగా 161 సీఆర్‌పీసీ కింద పైలట్, కో పైలట్‌కు నోటీసులు జారీ చేశారు. బుధవారం విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. చిప్సన్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కూడా నోటీసు ఇచ్చారు. కుంటిమద్ది హెలిపాడ్‌లో ఏం జరిగిందన్న దానిపై వివరణ ఇవ్వాలంటూ పైలట్ అనిల్ కుమార్‌తో పాటు కో పైలట్ శ్రయాజ్ జైన్‌కు నోటీసులు జారీ చేశారు.

# శ్రీవారి ఆలయంపై ఎగిరిన డ్రోన్!

- కేసు నమోదు

**తిరుమల, మహానాడు:** రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అన్షుమన్ తరెజా అనే ఓ యూట్యూబర్ మంగళవారం సాయంత్రం శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న హరినామ సంకీర్తన మండపం వద్ద డ్రోన్ ఎగురవేశాడు. దీనిని టీటీడీ విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని డ్రోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీలో కొత్తగా 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు

**అమరావతి, మహానాడు:** ఏపీలో కొత్తగా 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను సృష్టిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 1,136 ఎస్జీటీ, 1,124 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆటిజం సహా మానసిక వైకల్యం కలిగిన వారికి విద్యను బోధించేలా ఈ ప్రత్యేక ఉపాధ్యాయులను భర్తీ చేయాల్సిందిగా పేర్కొంటూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.



పాఠశాల విద్యాశాఖ - సమగ్ర శిక్షా - గుంటూరు జిల్లా వారి ఆధ్వర్యంలో మంగళవారం బ్రాడిపేట శాంతినికేతన్ పాఠశాలలో "ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ" కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యి, పిల్లలకు పరికరాలు పంపిణీ చేశారు.

# లిఫ్ట్‌లో రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రమాదం తప్పింది. నోవాటెల్‌లో సీఎం ఎక్కిన లిఫ్ట్ లో స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్ట్ లో 13 మంది ఎక్కడంతో మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తుకంటే లిఫ్ట్ కిందికి దిగింది. దీంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు. అటు హోటల్ సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే లిఫ్ట్ ఓపెన్ చేసి సీఎంను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సీఎంను అధికారులు వేరే లిఫ్ట్ లో పంపారు.

# అంబేద్కర్ పోరాటం సదా స్ఫూర్తిదాయకం

- మాజీమంత్రి ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మహానాడు:** అణగారిన వర్గాల సామాజిక ఆర్థిక సాధికారత, విద్యకోసం అంబేద్కర్ రాజకీయాలకు అతీతంగా అంబేద్కర్ చేసిన పోరాటం సదా స్ఫూర్తిదాయకమని, సమసమాజ నిర్మాణంకోసం పాటుపడిన గొప్ప



పోరాటయోధుడు అంబేద్కర్ అని మాజీమంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని పట్టణంలో తూర్పుమాలపల్లెలో బీ.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ కమిటీ ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను మాజీమంత్రి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కబడ్డీ పోటీల నిర్వాహకుల్ని, క్రీడాకారుల్నిప్రత్యేకంగా అభినందించారు. పోటీల ప్రారంభానంతరం ప్రత్తిపాటి మాట్లాడారు. కబడ్డీ పోటీలకు జాతీయ స్థాయిలో రాణించిన జట్లు కూడా రావడం స్వాగతించాల్సిన విషయమని, వచ్చిన జట్లన్నీ మంచి ప్రదర్శన కనబరిచి క్రీడాస్ఫూర్తిని చాటాలని ప్రత్తిపాటి సూచించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్ మోహన్, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ, గట్టినేని సాయి, పిల్లి కోటి, పిల్లి లెనిన్, మైల గణేష్, గేరా రాము, రాజ్ కమల్, వడ్డాని సుబ్బారావు వడ్డాని చిన్న కొప్పుల రాంబాబు, మాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా చంద్రబాబు పాలన

- ఆటోనగర్ శంఖుస్థాపనతో బుచ్చి పట్టణ అభివృద్ధికి శ్రీకారం
- స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుంది.
- ముఖ్యమంత్రి చంద్రబాబు గారి సహకారంతో షుగర్ ఫ్యాక్టరీ రైతులు మరియు కార్మికుల సమస్యకు శాశ్వత పరిష్కారం సాధిస్తా
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు:** ఆటో నగర్ శంకుస్థాపన ద్వారా బుచ్చిరెడ్డి పాళెం ప్రాంత అభివృద్ధికి అంకురార్పణ మొదలైందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి . బుచ్చి పట్టణ శివార్లలోని నాగమాంబాపురం వద్ద ఆమె ఆటోనగర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బుచ్చి మెకానిక్ అసోసియేషన్ కు చెందిన ఆటో టెక్నీషియన్స్ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి మేళతాళాల మధ్య పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ.. బుచ్చిరెడ్డిపాళెం మెకానిక్ సోదరుల చిరకాల స్వప్నమైన ఆటోనగర్ భూమిపూజ కార్యక్రమం ఎమ్మెల్యే హోదాలో తన చేతుల మీదుగా జరగడంచాలా సంతోషంగా వుందన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక అభివృద్ధి అనేది మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. కనీస వసతులు లేక రోడ్ల పక్కన మెకానిక్ షెడ్లు నిర్వహించుకుంటున్న దాదాపు 150 మంది మెకానిక్స్, వెల్డర్స్ తదితర టెక్నీషియన్స్ కు ఈ ఆటోనగర్ లో శాశ్వత వర్క్ షాపులు రాబోతున్నాయన్నారు.

APIIC ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ఆటోనగర్ భవిషత్తులో



నాగమాంబపురం స్థానికులకు ఉపాధి కేంద్రంగా మారబోతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషించే ట్రాక్టర్లు రిపేర్లు, వ్యవసాయ పనిముట్ల తయారీ లాంటి అవసరాలకు కోసం ఇటు బుచ్చి అటు కొడవలూరు మండల రైతాంగానికి ఈ ఆటోనగర్ చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు.

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో ఆటోనగర్ కోసం కేటాయించిన ఈ భూమిలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ల్యాండ్ లెవెలింగ్ చేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషించే ట్రాక్టర్లు రిపేర్లు, వ్యవసాయ పనిముట్ల తయారీ లాంటి అవసరాలకు కోసం ఇటు బుచ్చి అటు కొడవలూరు మండల రైతాంగానికి ఈ ఆటోనగర్ చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు.

దశాబ్ద కాలంగా పరిష్కారం కాని కోవూరు షుగర్ ఫ్యాక్టరి రైతులు మరియు కార్మికుల సమస్యను పది నెలల వ్యవధిలో పరిష్కారం చూపేందుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలియచేసారు.

%APIIC ద్వారా రోడ్లు, విద్యుత్తు, మరియు తాగునీరు లాంటి మౌలిక వసతులు కల్పించి రానున్న 2 నెలల్లో ఆటోనగర్ నిర్మాణం పూర్తి చేసి తానే ప్రారంభోత్సవం చేస్తానన్నారు. ఎన్నో సంవత్సరాల ఆటోనగర్ కల సాకారం అయిన సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం మెకానిక్ సోదరులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి, తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, బుచ్చి నగర పంచాయతి కౌన్సిలర్లు టిడిపి నాయకులు ఎంవి శేషయ్య, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు, కోడూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు?

- పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు
- సర్కారుపై వ్యతిరేక ప్రచారం పెరిగింది
- సోషల్‌మీడియా వాడరా?
- పార్టీకి ఇబ్బంది కలిగిస్తే మీకే నష్టం
- హైదరాబాద్‌లోనే ఉంటే ఎలా?
- సీఎల్పీ భేటీలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరికలు

**హైదరాబాద్:** పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. హైదరాబాద్ శివారు శంషాబాద్ నోవాటెల్‌లో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు.


కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని హెచ్చరించారు .

మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే, పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు.

ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా



అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై.. సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025


# నిజాయితీ.. నిబద్ధతతోనే రాజకీయాలు చేస్తా

- నన్ను నమ్మినంత కాలం నమ్మండి
- అనుమానం వచ్చిన రోజు నన్ను నమ్మడం మానేయండి
- కులాల పిచ్చి, రాజకీయ పిచ్చి నుంచి బయట పడాలి
- నేను వెళ్తే సీఎస్ ముఖం కూడా చూపించలేదు
- నేను దేన్నీ వదిలిపెట్టను.. ఎవర్నీ వదిలిపెట్టను
- కుల గుర్తింపు ఇంటి వరకే పరిమితం కావాలి
- మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు

**సహజంగా ఏ రాజకీయ నాయకుడైనా తానిచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాజీనామా చేస్తానంటారు. లేకపోతే అందుకు ఎదుటి పార్టీ వారే కారణమని నిందిస్తారు. కానీ.. నన్ను నమ్మినంతకాలం నమ్మండి. అనుమానం వచ్చినరోజు నమ్మడం మానేయడంటూ చెప్పిన తొలి రాజకీయనాయడు కొత్తగా తెరంగేట్రం చేశారు.**

**'నేను నిజాయితీతో కూడిన రాజకీయాలే చేస్తా. ఆ మేరకు నా అడుగులు చూసి, నన్ను నమ్మినంతకాలం నమ్మండి. అనుమానం వచ్చిన రోజు నన్ను నమ్మడం మానేయండి"అని విభిన్నంగా వ్యాఖ్యానించారు మాజీ డీజీపీ, తాజాగా రాజకీయ అరంగేట్రం చేసిన ఏబీ వెంకటేశ్వరరావు! తాను నమ్మిన సిద్ధాంతం, నిజం కోసం ఎంతదూరమైనా వెళతానన్నారు. ఎవరినీ వదిలిపెట్టను. దేనినీ వదిలిపెట్టనంటున్న ఏబీవీ.. ఏపీలో పెరుగుతున్న కులపిచ్చి, కులాంతర వివాహాలు, విద్వేష రాజకీయాలు, జగన్‌పై తన యుద్ధవ్యూహం, సర్వీసులో ఉండగా తన వృత్తిపరమైన అనుభవాలు, తీపి-చేదు ఘటనలను 'విజిల్' డిజిటల్ చానెల్‌తో పంచుకున్నారు.**

**విజిల్: ఒక అధికారి రాజకీయ ఒత్తిడి నేపథ్యంలో దూరంగా ఎలా ఉండాలి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి..?**

**ఏబీవీ:** నిజాయితీ, నిబద్ధతలే 50 శాతం రక్షిస్తాయి. ముక్కుసూటి మనిషి, డబ్బుకు లొంగడు అని తెలిసినప్పుడు.. సగం మంది దగ్గరకు కూడా రారు. అయినా సరే ఒకసారి అడిగి చూద్దాం అనే వాళ్లు ఉన్నారు. ఒత్తిడి చేస్తారు. బదిలీ చేస్తామని బెదిరిస్తారు.. దానికి కూడా సిద్ధంగా ఉంటే.. ఏ ఒత్తిడి ఉండదు. వాట్ యువర్ కమిట్‌మెంట్.. వాట్ యూ స్టాండ్ ఫర్.. నిర్ణయం నీదే.

**విజిల్: జగన్ ఏలుబడిలో.. గడిచిన ఐదేళ్లల్లో జరిగిన దాష్టికాలకు,అకృత్యాలకు సంబంధించి, కూటమి ప్రభుత్వంలో ఒక ప్రత్యేకమైన యంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలనేది మెజారిటీ ప్రజల అభిప్రాయం. కానీ ఆ దిశగా అడుగులు పడటం లేదనే విమర్శలు ఉన్నాయి. అవి సహేతుకమేనా..?**

**ఏబీవీ:** ప్రత్యేకమైన యంత్రాంగం ఏం లేదు. అక్కడక్కడా ప్రత్యేక సిట్ ఏర్పాటు చేశారు. అవి పని చేస్తున్నాయి.

**విజిల్: జగన్ బాధితులకు సాయం చేయాలని, అండగా ఉండాలనే లక్ష్యంతోనే మీరు కాలు బయటపెట్టారు. ఆపరిస్థితి ఎందుకు వచ్చింది.?**

**ఏబీవీ:** నేను 35 ఏళ్లు ఉద్యోగం చేశాను. 30 ఏళ్లు ఒకెత్తు.. గత ఐదేళ్లు ఒకెత్తు. ఈ స్థాయిలో వ్యవస్థల విధ్వంసం ఎప్పుడూ జరగలేదు. పోలీసు శాఖ ద్వారా జరిగిన విధ్వంసంలో బాధితులే కాకుండా.. ఇతర విభాగాల బాధితులందరికీ న్యాయం చేయాలంటే ఒకరు ముందుకు రావాలి. వీరికి న్యాయం చేయాలంటే శ్రద్ధ పెట్టాలి. తప్పు చేసిన వారిని శిక్షించాలని అంతా అనుకుంటారు. కానీ కొన్ని రోజులకు బాధితులను పట్టించుకోరు. కాబట్టి ఇలాంటి వారి మీద శ్రద్ధ పెట్టాలని నేను భావించాను. ఐదేళ్ల పాలన ప్రత్యక్షంగా చూశాను కాబట్టి.. జగన్ నెవర్ ఎగైన్ అనే కృతనిశ్చయంతో పనిచేస్తున్నా. బాధితులకు న్యాయం జరిగేలా చేస్తాను. అన్యాయం చేసిన వాళ్లను చట్టం ముందు దోషులుగా నిలబెట్టేందుకు ప్రయత్నం చేస్తా.

**విజిల్: జగన్‌పై వ్యక్తిగత కక్ష లేదు అన్నారు. కానీ జగన్ మాత్రం మిమ్మల్ని వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెట్టారు కాబట్టి అలా అన్నారా మీరు?**

**ఏబీవీ:** వ్యక్తిగతంగా జగన్ నన్ను ఏం ఇబ్బంది పెట్టాడో.. దానికి నేను ఏ రకంగా సమాధానం చెప్పానో అవన్నీ చెల్లు అయిపోయాయని నేను భావిస్తున్నా.. ఆయన భావిస్తున్నారో లేదో నాకు తెలియదు. నా వరకు అదే విషయాలు పట్టుకుని పనిచేసే మనిషిని కాదు. రిటైర్ అయిపోయాను.. ఇప్పటికిప్పుడు నన్ను ఏం చేయలేడు. ఐదేళ్లు అధికారం అడ్డుపెట్టుకుని చేయగలిగింది చేశారు. నేను వెళ్తే సీఎస్ ముఖం కూడా చూపించలేదు. నేనిచ్చిన కాగితం కూడా తీసుకునేందుకు ఇష్టపడలేదు. అంత కంట్రోల్ చేశారు. నేను కూడా చేయగలిగింది చేశాను. కాబట్టి చెల్లు అయిపోయినట్లు నేను భావిస్తున్నా.

**విజిల్: జగన్‌కు మీకు ఎక్కడ వైరం ఎక్కడ మొదలైంది?**

ఏబీవీ: నాకు జగన్‌తో పరిచయం కూడా లేదు. అసలు ప్రత్యక్ష వైరం అనేదే లేదు. నేను విజిలెన్స్ విభాగాన్ని చూసినప్పుడు నేనేదో చేశానని ఆయనకు మోసిన వాళ్లు మోశారు. అది ఆయన నమ్మారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పరిశీలించాలి. నిజంగా నేను వెధవ పని చేసుంటే.. నా మీద చర్యలు తీసుకోవాలి. కానీ.. విచారణ ఎందుకు?

మనం గట్టిగా నమ్ముతున్నామంటే.. నిజమే అని అనుకున్నారో ఏమో.. లేకపోతే వీడి మీద విచారణ.. దానికి ఆయన వివరణ ఇచ్చుకోవడం అనేది వేస్ట్ అనుకున్నారో ఏమో.. వేటు వేయండి అని నిర్ణయానికి వచ్చారేమో తెలియదు కానీ.. ఎన్నోసార్లు వాళ్ల అనుమానాలు నివృత్తి చేసేందుకు నేను ఎంతో ప్రయత్నం చేశా.

అడిగితే నిజమే చెప్తా.. ఎంత వరకు నిజమో.. ఎంత వరకు అబద్ధమో చెప్తా... నాకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా, పోస్టింగ్ ఇవ్వకుండా, జీతం ఇవ్వకుండా చేయాల్సినంత అవసరం ఎందుకు. జగనే కాదు.. చుట్టు ఉన్న సిస్టమ్ మొత్తం దానిని ముందుకు తీసుకెళ్ల లేదు. డీజీపీ, అజయ్ కల్లాం, ప్రవీణ్ ప్రకాశ్, ధనుంజయ్ రెడ్డి, సీఎస్.. చివరికి సీఎస్‌ఓకు కూడా చెప్పాను. అపాయింట్‌మెంట్ ఇస్తే అనుమానాలు నివృతి చేస్తానని చెప్పా. మరి అడిగారో లేదో తెలియదు. చివరికి నన్ను సస్పెండ్ చేశారు.

**విజిల్: నంద్యాల ఉప ఎన్నికలో మీరు టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారు.. ఆ విజయం వెనుక మీరున్నట్లు జగన్ నమ్మటం.. ఫలితం టీడీపీకి అనుకూలంగా రావడం.. ప్రతి కుక్కకు ఒకరోజు వస్తుంది.. నారోజు వచ్చినప్పుడు నేను చెప్తా.. అంటు జగన్ చేసిన వ్యాఖ్యలు.. అన్నట్లుగానే ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత మీపై నేరుగానే టార్గెట్ చేశారు. మీరు కూడా హైకోర్టు, సుప్రీం కోర్టు వరకు...**

**ఏబీవీ:** కాసేపు నిజమే అనుకుందాం... 151 సీట్లతో గెలిచారు కదా.. బోడి ఎప్పుడో జరిగిపోయిన ఉప ఎన్నిక ఫలితాల గురించి అంత పెట్టుకోవాల్సిన అవసరం ఏముంది? అంత ముఖ్యం కాదు. రాజకీయాల్లో ఉండే వాళ్లు వాటిని లైట్‌గా తీసుకోవాలి. 151 సీట్లు గెలిచిన తర్వాత ఉప ఎన్నికల గురించి కక్ష తీర్చుకోవాల్సిన అవసరం ఏముంది?

**విజిల్: ఆనాటి ప్రభుత్వం మీ మీద టార్గెట్‌గా వ్యవహరించడం.. కొంతమంది అధికారులు కూడా సాటి అధికారి అనేది కూడా లేకుండా అత్యంత అమానవీయంగా వ్యవహరించడం.. కొన్ని ఫేక్ పత్రాలు కూడా తయారు చేశారు. అలాంటి వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకునే అవకాశాలున్నాయా?**

**ఏబీవీ:** 2022లోనే నేను పిటిషన్ వేశాను. అది ఇంకా కోర్టులోనే ఉంది. నేను దేన్ని వదిలిపెట్టను. ఎవర్నీ వదిలిపెట్టను. అది ఎక్కడి వరకు వెళ్తుందో.. వాళ్లకు నిజంగా శిక్షలు పడతాయో లేదో వేరే విషయం.. కానీ నేనైతే వదిలిపెట్టను. చివరి వరకు పోరాడుతా. వారి తప్పులను బయటపెడతా.. వెంటపడతా.

**విజిల్: సాక్షి దినపత్రిక మిమ్మల్ని మళ్లీ టార్గెట్ చేసింది కదా..**

**ఏబీవీ:** విరుచుకుపడకపోతే విచిత్రం కదా?

**విజిల్: మీరే కోడికత్తి శ్రీనును తయారు చేయించి.. అతనికి కత్తి ఇచ్చి పొడిపించారని అర్థం. ఐదేళ్లు సీఎంగా ఉన్నారు. ఇవాళ కూడా మళ్లీ ఆరేళ్ల క్రితం స్టోరీని ఎలా అర్థం చేసుకోవాలి?**

**ఏబీవీ:** వాళ్లు స్టోరీ రాయడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ అది ఎవడైనా చూసి నమ్మితే వాళ్ల మీద జాలి పడతా. కొంచమైనా ఆలోచించండి. ఏదిబడితే అది రాస్తే నమ్మద్దు అని సూచిస్తా.. అది చూసిన తర్వాతే సాక్షి పత్రిక వాళ్లకు నేను ఒక ట్వీట్ పెట్టా.. ఈ కోడికత్తి విషయంలో అన్ని అనుమానాలు తీర్చేందుకు ఓపెన్ డిబేట్‌కు నేను సిద్ధం.. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయమని కూడా చెప్పా.

కానీ ఎలాంటి బదులు రాలేదు. వాళ్లు ఓకే అంటే.. అన్ని రకాల ఆధారాలతో అన్ని అనుమానాలు నివృతి చేస్తా.. కుట్ర చేసిన వాడినే అయితే.. నేను వెళ్లి వాళ్లను ఎందుకు కలుస్తా.. రాసేవాళ్లకు ఆ మాత్రం ఆలోచన కూడా లేదా. ఓపెన్‌గా కలవాల్సిన అవసరం ఏముంది నాకు. ఫోటో దిగితే అతనికేం వస్తుంది?

**విజిల్: ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు నిరూపించాలి కదా దానిని?**

**ఏబీవీ:** కొన్ని లక్షణాలు కొంతమంది మనుషులకు, పార్టీలకు కూడా ఉంటాయి. ఒక అబద్ధాన్ని నిజం లాగా నిరూపించేందుకు ప్రయత్నం చేస్తారు. పదే పదే చేస్తారు. చేసిన తర్వాత ఆ అబద్ధాన్ని నిజమని వాళ్లే నమ్ముతారు. ఇదొక మానసిక సమస్య. చాలామంది రాజకీయ నేతల్లో చూశాను. పార్టీ పేపర్ కాబట్టి సాక్షికి కూడా వచ్చింది. అబద్ధాన్ని నిజమని నమ్మించే ప్రయత్నంలో మీరు కూడా దానిని నిజమని నమ్మే మానసిక వైకల్యానికి అది దారి తీసింది. అందుకే ఓపెన్ డిబేట్‌కు నేను రెడీ అని చెప్పా.. ఇక వాళ్ల ఇష్టం.

**విజిల్: బాల్యం, స్కూల్, తల్లిదండ్రుల వివరాలు క్లుప్తంగా తెలియజేస్తారా?**

**ఏబీవీ:** నూజివీడు తాలుకా పాఠాశాలలో తల్లిదండ్రులిద్దరు ఉపాధ్యాయులు. కృష్ణా జిల్లా మీర్జాపురంలో జన్మించాను. మూడో ఏడాది నుంచే విద్యాభ్యాసం ప్రారంభం. అన్నవరం గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి.




నూజివీడు ఎస్ఆర్ఆర్ జెడ్పీ పాఠశాలలో హైస్కూల్ విద్య పూర్తి. డీఏఆర్ కాలేజీలో ఇంటర్, ఇంజనీరింగ్, మాస్టర్స్ పూర్తి.

**విజిల్: మీరు మంచి రచయిత కూడా అంట కదా.. వేరే పేరుతో..?**

**ఏబీవీ:** తెలుగులో సాహిత్యం చదవటం చిన్నపుటి నుంచే అలవాటు. ఊర్లో ఉన్న గ్రంథాలయంలో చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదివే అలవాటు. నూజివీడు లైబ్రరీకి కూడా రోజు వెళ్లేవాడిని. అలాగే డిటెక్టివ్ నవలలు చదివేవాడిని. చిన్నప్పటి నుంచే ఉన్న అలవాటు.. అలాగే కొనసాగింది. పెద్దైన తర్వాత ఇంగ్లీష్ సాహిత్యం కూడా చదివేవాడిని. తెలుగు మీడియం విద్యాభ్యాసం వల్ల, తెలుగులో రాయడం కష్టం అనిపించలేదు. అందుకే అప్పుడప్పుడు రాస్తుంటాను.

**విజిల్: అంతకు ముందు పత్రికల్లో మీరని తెలియకుండా మీ కలం పేరుతో రాసిన రచనలు ఏమిటవీ..? కలం పేరు ఏమిటి?**

**ఏబీవీ:** మేథోమథనం అని ఒక శీర్షికను ముందు వారం వారం.. తర్వాత 15 రోజులకు ఓసారి.. ఎడిటోరియల్ పేజీలో రాశాను. వర్తమాన పరిస్థితులపైన, సంఘటనలపైన సైద్ధాంతిక దృక్కోణంలో చూసి వివరణాత్మకంగా విశ్లేషణాత్మకంగా రాశాను. దానిని చాలామంది వామపక్ష రచయితలు, సిద్ధాంతకర్తలు చాలా తీవ్రంగా వ్యతిరేకించారు. వాళ్లు కూడా వ్యతిరేకంగా వ్యాసాలు రాశారు. దానిని జవాబుగా నేను వ్యాసాలు రాశాను. నాలుగేళ్ల పాటు ఈ ప్రయాణం కొనసాగింది. నా కలం పేరు జాహ్నవి.

**విజిల్: పోలీసు ఉద్యోగంలో ఎదుర్కొన్న మొదటి సంఘటన ఏమిటి?**

**ఏబీవీ:** ఏఎస్పీగా ఉద్యోగం చేస్తున్న సమయంలో 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చివేత. నేను పనిచేసిన ఊర్లో.. ముస్లిం జనాభా ఎక్కువ. వాళ్లంతా చేసిన ఊరేగింపు ఉద్రిక్తంగా మారింది. చివరికి దాడులు జరుగుతాయనే వరకు వెళ్లింది. దానిని కంట్రోల్ చేయడమే నేను ఎదుర్కొన్న మొదటి సవాల్.

**విజిల్: మీ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే సంఘటన అంటే ఏమిటి?**

**ఏబీవీ:** చాలా ఉన్నాయి..ఒకదానిని ఎంచుకోవటం చాలా కష్టం. వాటిల్లో జూబ్లీహిల్స్ బాంబు పేలుళ్ల కేసు విచారణ ఒకటి. విజయవాడ కమిషనర్‌గా పనిచేసిన సమయం చాలా ప్రత్యేకం. చాలా ప్రయోగాలు చేసి విజయం సాధించాం.

**విజిల్: ఒక అధికారిగా బాధ్యతలు నిర్వహించే సమయంలో నైతికత చాలా ప్రామాణికం. మీ వృత్తిధర్మంలోఎప్పుడైనా గందరగోళానికి గురైన సందర్భాలున్నాయా?**

**ఏబీవీ:** సవాళ్లు ప్రతి అధికారికి, ప్రతి మనిషికి ఖచ్చితంగా ఎదురవుతాయి. అలాగే అధికారులకు ఇంకా ఎదురవుతాయి. ఎందుకంటే కఠిన పరిస్థితులు ఎదుర్కొంటారు కాబట్టి. చాలాసార్లు అధిగమించాం. కేసులు మాఫీ చేయాలని, కేసు తీవ్రత తగ్గించమని, అరెస్టులు ఆపాలని.. ఇలాంటి ఒత్తిళ్లు చాలా వచ్చాయి. అలాగే డబ్బు కూడా ఆశ చూపారు. కానీ ఒత్తిడికి ఏ రోజు లొంగలేదు.

**విజిల్: మీరు చేయని ఒక తప్పునకు.. వృత్తి ధర్మాన్ని ధర్మంగా నిర్వర్తించినందుకు మీరు ఒక ఘటన ఎదుర్కొన్నారు. అప్పటి మీపై అధికారి ఆంజనేయ రెడ్డి మీకు అండగా నిలబడ్డారు. ఆ ఘటన గురించి?**

**ఏబీవీ:**అనుకోకుండా.. ఒక డీఎస్పీ సెలవులో ఉన్నప్పుడు నేను ఇంఛార్జ్‌గా వ్యవహరించాను. ఆ సమయంలో ఒక గ్రామంలో హత్య జరిగినట్లు తెలిసి ఓఎస్డీ హోదాలో దర్యాప్తు అధికారిగా వెళ్లాను. దారిలో ఒక దగ్గర జనం ఉండటం చూసి ఏమైంది అని అడిగితే.. అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పారు. అది కావాలని చేసిన అగ్నిప్రమాదం అని నాకు అర్థమైంది. కావాలనే అలా చేశారని నాకు అనిపించింది.

ఇన్సూరెన్స్ చీటింగ్ కేసు అని అర్థమైంది. ఆ కేసును డీఎస్పీ హోదాలో నేనే టేకప్ చేశాను. సాక్ష్యాలు సేకరించాను. స్టేట్‌మెంట్ రికార్డు చేశాను. వాళ్ల మోసాన్ని బయటపెట్టి అరెస్టులు చేశాం. నేనేదో సింపుల్ కేసు.. కిందవాళ్లకు అప్పగిస్తే.. వదిలేస్తారని భావించి అరెస్టుల వరకు తీసుకెళ్లా.. ఆ తర్వాత తెలిసిన విషయం ఏమిటంటే.. అరెస్టు అయిన వారిలో ఒకరు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు బంధువులు సంబంధించిన వాళ్లు అని.

ఆ తర్వాత పీవీ కుటుంబ సభ్యులతో పాటు పీసీసీ పెద్దలు కూడా నాటి సీఎం విజయభాస్కర్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఒత్తిడి భరించలేక విజయభాస్కర్ రెడ్డి నన్ను బదిలీ చేశారు. ఎందుకు చేశారని అడిగితే.. పీవీ బంధువును అరెస్టు చేశావని చెప్పారు. అదో చిన్న కేసు... దాని కోసం నన్ను బదిలీ చేయడం ఏమిటని ప్రశ్నించా... కులం పేరు పెట్టి తిట్టానని కొత్తగా సృష్టించారు. వాళ్ల కులమే నాకు తెలియదని నేను ఎంత చెప్పినా వినలేదు.

నన్నుతక్షణమే విధుల నుంచి తప్పించాలని ఒత్తిడి చేశారు. అప్పుడు ఆంజనేయ రెడ్డి దగ్గరకు విషయం వెళ్లింది. ఉన్నది ఉన్నట్లు చేసినా ఇలా బదిలీ చేస్తారా అని ప్రశ్నించాను. నాకు బాధ ఏమిటంటే.. నాటి డీజీపీ పేరు ఎందుకు పిలిపించారు. ఏఎస్పీ ర్యాంక్ అధికారిని కనీసం కూర్చోమని కూడా చెప్పలేదు. పైగా నాపైనే కేకలు వేశారు. నేనేదో తప్పు చేసినట్లు నిలబెట్టి మాట్లాడటం నన్ను చాలా బాధించింది.

ఆ విషయంపై ఆంజనేయ రెడ్డి చెప్పాను. వెంకటేశ్వర్రావు ఇవన్నీ ఉంటాయి.. మనం కేవలం చట్టానికి, కోర్టులకే జవాబుదారి. తప్పు చేస్తే.. కోర్టులు మొట్టికాయలు వేస్తాయి. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆ నీతి సూత్రం నా కెరీర్ చివరి రోజు వరకు గుర్తుంది. ఏం చేసినా సరే.. ఖచ్చితంగా కోర్టులకు బాధ్యత పడాలి.

**విజిల్: పోలీసు సేవలోకి రావాలనుకునే నేటి యువతకు మీరిచ్చే సలహా?**

**ఏబీవీ:** కొత్తకొత్త సవాళ్లు ఎదురవుతాయి. ఈ రోజు చాలామంది యువకులకు డబ్బు ఆశ చూపిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఇప్పుడు బాగా పెరిగాయి. వీటిని తట్టుకునే ధైర్యం, స్థైర్యం ముందు నుంచే అలవాటు చేసుకోవాలి. నాలాగా అమాయకత్వంగా ఉండకూడదు.

**విజిల్: పోలీసు విభాగంలో సాంకేతిక పరమైన మార్పులు ఏం తీసుకువచ్చారు..?**

**ఏబీవీ:** నాకు టెక్నాలజీ అంటే కొంచెం పిచ్చి. మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటి పోస్టింగ్. అప్పట్లో రహదారులు చాలా అధ్వాన్నం. ప్రయాణం నరకం. జిల్లాలో పర్యటించే సమయంలో టెక్నాలజీ పుస్తకాలు బాగా చదివాను. టెక్నాలజీ విషయంలో అప్‌డేట్‌గా ఉన్నాను. 2003లో చీఫ్ ఇన్ఫర్‌మేషన్ ఆఫీసర్ అని ప్రభుత్వం ఓ కార్యక్రమం మొదలుపెట్టింది. ఐఐటీ అహ్మదాబాద్ వాళ్లు ఆ కార్యక్రమం నిర్వహించారు. అవగాహన పెరిగింది.

టెక్నాలజీని పోలీసింగ్‌లో ప్రవేశపెట్టడంలో చాలా ప్రయత్నాలు చేశా. నేను చేసిన ప్రయత్నాలు విఫలం కాలేదు. ఇంటికి వెళ్లి ఎఫ్ఐఆర్ ఇవ్వటం అనేది దేశంలోనే మొదటిసారి ప్రవేశపెట్టాం. అమెరికాలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి.. దానిని ఏపీలో మొదటిసారి అమలు చేశాం. విజయం సాధించాం కూడా. గ్రామీణ ప్రాంతాల కోసం 3 ప్రత్యేక వాహనాలు కూడా ఏర్పాటు చేశాం.

పోలీస్ స్టేషన్‌లలో రిసెప్షన్ ఏర్పాటు చేశాం. ఫిర్యాదు చేసిన వెంటనే ఓ రశీదు ఇస్తాం. ఆ వివరాలు ఎస్పై, సీఐ, డీఎస్పీ, డీసీపీతో పాటు కమిషనర్ వరకు చేరుతాయి. పై అధికారికి కూడా మెసేజ్ వెళ్లింది కాబట్టి.. సమస్యలను వెంటనే పరిష్కారం చేశారు. దీని వల్ల ఎఫ్ఐఆర్ సంఖ్య తగ్గింది. పోలీసులపైన, కోర్టులపైన పని భారం తగ్గింది. ఇది నా జీవితంలో చాలా పెద్ద విజయం.

**విజిల్: విజయవాడలో ఈట్ స్ట్రీట్ ఆలోచన మీదే అంటారు?**

**ఏబీవీ:** రాత్రి పూట బయట తిరిగే సమయంలో ఒక సందులో కొంతమంది గుమ్మిగూడి ఉన్నారు. కారు చూసి పారిపోయారు. అసలు ఎందుకు పారిపోయారని అడిగాను. విద్యార్థులకు రాత్రి పూట టిఫిన్ అమ్ముతున్న విషయం గుర్తించా. ఇంత చిన్న విషయానికి పోలీసు ఆంక్షలు ఎందుకు అని ఆలోచించా. చీకట్లో నిలబడి దొంగల్లా తినాల్సిన అవసరం ఏమిటని ఆలోచించా.

విజయవాడలో చిన్నప్పటి నుంచి తిరిగాను కాబట్టి.. ఇక్కడి పరిస్థితులు పూర్తిగా తెలుసు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాళ్లు ఎక్కువ. ఇలాంటి వారి కోసమే ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలని ఆలోచించాం. బహిరంగంగా వ్యాపారం చేసుకునేందుకు అనుమతిస్తే.. వాళ్లు ముందు భయపడిపోయారు. లైసెన్స్ అవసరం లేదనే కనీస విషయం కూడా తెలియదు.ధైర్యం చేసి కొంతమంది ముందుకు వచ్చారు. రఘునందనరావు కలెక్టర్, నాగలక్ష్మి సబ్ కలెక్టర్, వీరపాండియన్ కమిషనర్.. వాళ్లే దానిని ప్రారంభించారు.

ఎవరికీ రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పాను. రుచిగా, శుచిగా, శుభ్రంగా ఉండాలని ఆదేశించాను. చాలా కఠినంగా వ్యవహరించాను. దీనిని అప్పట్లో ఉన్న మేయర్, శాప్ అధికారులు అభ్యంతరం చెప్పారు. అందరితో మాట్లాడి సమస్య పరిష్కరించాం. ఇప్పుడు ఎంతో ఆనందంగా ఉంది. ఒక ముస్లిం మహిళ ఒంటరిగా ఈట్ స్ట్రీట్‌కు వచ్చి తనకు కావాల్సినవి తీసుకెళ్లే పరిస్థితి విజయవాడలో ఉంది. ఇది కదా నిజమైన స్వాతంత్ర్యం?

**విజిల్: ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి ఏపీలో కులాల కుంపట్లు.. కొత్తగా మతాల రగడ మొదలైంది. ప్రతి కులంలో మహనీయులు, భావ దరిద్రులు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దాష్టికానుంచి బయట పడే పరిస్థితి లేదంటారా?**

**ఏబీవీ:** దానంతటది బయటపడలేదు. ఇలా అని మనం ఏం చేయకపోతే దాన్నుంచి బయటకు రాలేం. ఇంకా ఇరుక్కుపోతాం. ప్రతి కులంలో ఉపకులాలను కూడా సృష్టిస్తారు. కాబట్టి దాని కోసం పని చేయాలి. ఒకరి వల్ల సాధ్యం కాదు. ఒకప్పుడు సోషల్ నార్మ్ అనుకున్నవి కాలక్రమేణా దానిపై చర్చలు జరిగి.. మేధావులు మాట్లాడుతూ.. ఇంకా ఎక్కువ మంది ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినపుడు సమాజంలో మార్పు వచ్చింది.

అది తప్పు అని ఎత్తి చూపే మేధోపరమైన ఉద్యమం అవసరం. పాత రోజులతో చూస్తే ఇప్పుడు మూఢ నమ్మకాలు తక్కువ. అలాగే ఆచార వ్యవహారాల్లో, నియమాల్లో మార్పులు వచ్చాయి. పెళ్లిళ్లు, వర కట్నం విషయంలో చాలా మార్పులు. సామాజికంగా అభిప్రాయాలు మారాయి. సాహిత్యం, సినిమాలు, కళల్లో వివరించారు. డిబేట్ జరగాలి. అప్పుడే సమాజంలో మార్పు వస్తుంది.

కులాల దరిద్రం నుంచి మనం బయట పడాలి అంటే ఇలాంటి ఉద్యమం అవసరం. నా ఉద్దేశ్యంలో చారిత్రకంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన 1953 నుంచి ఆంధ్ర, తెలంగాణ కలిసి పోయిన 1956 తర్వాత నుంచి కూడా.. ఈ కులాల జాడ్యం ఇంకా వదలకపోవడానికి కారణం.. మనం తెలుగు మాట్లాడే వారికి కులం తప్ప వేరే ఏ గుర్తింపు నేర్పలేదు. ఆంధ్రులుగా ఒక గుర్తింపు, తెలుగు వారిగా ఒక గుర్తింపు కోసం మనం ఎప్పుడు ప్రయత్నం చేయలేదు.

మండలి వెంకట కృష్ణారావు విద్యా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తెలుగు భాషా సంరక్షణ గురించి చాలా కృషి చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో కూడా నేను పాల్గొన్నా. తెలుగు గుర్తింపు కోసం జలగం వెంగళరావు బాగా కృషి చేశారు. ఆ తర్వాత ప్రపంచమంతా తెలుగు వారికి గుర్తింపు తీసుకువచ్చింది ఎన్టీ రామారావు. ఆయన హయాంలో కులాల గొడవలు అత్యంత తక్కువ స్థాయిలో ఉన్నాయి.

మేరు పర్వతం లాంటి ఆయన ముందు ఏ రకమైన విభజనలు పని చేయలేదు. ఆయనకు కులం అంటించేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయినా సరే ఆ మహానుభావుడి ముందు అవేవీ పెద్దగా పనిచేయలేదు. తెలంగాణలో ఈ జాడ్యం కొంచెం తక్కువ స్థాయిలో ఉండటం వల్ల.. ఆ రోజుల్లో బాగా గడిచింది. తెలుగు గుర్తింపు కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. అప్పుడే కులం అనేది చేతుల్లో ఉండే గుర్తింపు. దానిని రాజకీయ పరంగా అంగీకరించినంత వరకు రాజకీయ నాయకులు దానిని ఇంకా వాడుతూనే ఉంటారు.

సమస్యను ఎత్తి చూపిస్తున్నా.. పరిష్కారం చూపించటం లేదు. పరిష్కారం అవసరం. ముఖ్యంగా ఏపీలో గౌరవప్రదంగా మర్యాద పూర్వకంగా బతకాలి అంటే.. దీని మీద మేధావులు అంతా పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో భావ విప్లవం తీసుకురావాలి. కుల గుర్తింపు ఇంటి వరకే పరిమితం కావాలి. బయటకు వచ్చి మాట్లాడటం అసహ్యించుకునే రోజు రావాలి. అప్పుడు దీని ప్రభావం రాజకీయాల మీద తగ్గుతుంది. రాజకీయాల మీద తగ్గినపుడు మిగిలినవన్నీ సర్దుకుంటాయి.

**విజిల్: దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్య కులం. రాజకీయ నేతలు కూడా కులాల ప్రాతిపదికనే ఓటు రాజకీయాలు నడుపుతున్నారు. అయితే సోషల్ రీ ప్రొడక్షన్ జరగకుండా ఈ కులజాడ్యం వెళ్లిపోవడం సాధ్యమేనా?**

**ఏబీవీ:** సోషల్ రీ ప్రొడక్షన్ అంటే.. కులాంతర వివాహాలు జరగాలంటారా? ఇది సమస్యకు పరిష్కారం కాదు. కులం ప్రభావం రాజకీయాల మీద, సమాజం మీద తగ్గించడానికి కులాంతర వివాహం సాయం చేస్తుందంతే.. కానీ అదే పరిష్కారం కాదు.

**విజిల్: రీ ప్రొడక్షన్.. అంటే జాతి ఉన్నంత వరకు ఇది ఇలా మోయాల్సిందే...**

**ఏబీవీ:** అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఐడెంటిటీ ఫీ కొంచమైన ఫీల్ అవుతారు. ఇంగ్లండ్ నుంచి వచ్చిన వారు కూడా ఏ ప్రాంతం నుంచి వచ్చారో దానిపైన ఆధారపడతారు. ఆ ప్రాంతంపైనే ఎక్కువగా ఆధారపడతారు. అక్కడ కులాంతర వివాహాలు ఎక్కువ కాబట్టి.. అక్కడ కులం, ప్రాంతానికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. కానీ నేను ఐరిష్ కాబట్టి.. ఇలా ఉంటాను అంటే.. అంతా అసహించుకుంటారు. ఆ రకంగా మన దగ్గర కూడా వ్యవహరించాలి. అలా చేస్తేనే సమాజంలో వచ్చిన రోజు.. దాని ప్రభావం ఎవరి మీద ఉండదు. ఉండకూడదు.

**విజిల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ కేడర్, జగన్ బాధితుల కోసం ప్రత్యేకమైన యంత్రాంగం ఏర్పాటుచేసి దానికి ఏబీ వెంకటేశ్వర్రావు లాంటి అధికారిని నియమిస్తే.. అరాచకాలను బయటకు తీసేందుకు ఆలపాటి సురేష్ కుమార్ అనే సీనియర్ పాత్రికేయులు విధ్వంసం అనే 600 పేజీల పుస్తకం రాశారు. దానికి ఓ ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసి.. ఓ అధికారిని నియమించాలనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. మిమ్మల్ని పెడతారని కూడా అంతా అనుకున్నారు. కానీ ఈ మధ్య ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇస్తూ జీవో కూడా విడుదల చేశారు. దానిపైన ఎక్కడా మాట్లాడలేదు కూడా. దాని గురించి మీ స్పందన?**

**ఏబీవీ:** మనిషికి జీవితకాలం తక్కువ. మనకున్న సమయంలో ఏం చేయగలమనే విషయంపై స్పష్టత ఉండాలి. ఒక లక్ష్యం ఉండాలి. ప్రాధాన్యత ప్రకారం నడుచుకోవాలి. జగన్ మోహన్ రెడ్డి అనే రాజకీయ నాయకుడు, వైఎస్ఆర్‌సీపీ అనే రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందనేది వాళ్లు అధికారంలోకి రాకముందే నాకు అవగాహన ఉంది. కానీ ప్రజలు గెలిపించారు.. ఆయన ఐదేళ్ల పాలన చూశారు.

కానీ మళ్లీ అలాంటి పరిస్థితి ఏపీకి రాకూడదు అనే కృత నిశ్చయంతో ఆ పనిలోనే నా జీవిత కాలాన్ని గడిపేందుకు నేను అడుగులు వేస్తున్నా. నా లక్ష్యానికి నాకు వచ్చిన పదవికి సంబంధం లేదు కాబట్టి.. దానిని తిరస్కరించాను. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి నా అభిప్రాయాలను ప్రజలకు వివరిస్తా. ఇదే నాకు ఈ రోజు ఉన్న ప్రాధాన్యత..

**విజిల్: జగన్ అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో ముందే ఊహించా అన్నారు. జగన్ అధికారంలోకి వస్తున్నాడు అని మీరు ఇంటెలిజెన్స్ విభాగాధిపతిగా ఉన్నప్పుడు ముందే ఊహించారా?**

**ఏబీవీ:** ఇంటెలిజెన్స్ చీఫ్‌గా చేసినప్పటి పనుల గురించి బహిరంగంగా మాట్లాడటం విజ్ఞత కాదు.. అది రాజనీతిజ్ఞత కాదు. దాని గురించి నేను కామెంట్ చేయను.

**విజిల్: జగన్ పాలనలో జరిగిన బాధితులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేస్తామన్నారు.**

**ఏబీవీ:** పర్యటన అనేది నాకు లేదు. ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి వెళ్తా.. ఎక్కడెక్కడ నా అవసరం ఉందో.. అక్కడికి తప్పకుండా నేను వెళ్తా.. అందులో భాగంగానే కోడికత్తి శ్రీను కుటుంబాన్ని కలిశాను. అతని జీవితం మొత్తం నాశనం చేశారు. అతని కుటుంబం కూడా పూర్తిగా నాశనం. అతను చేసింది తప్పే కదా అని కొంతమంది ప్రశ్నించారు.. నిజమే.. అతను చేసింది వంద శాతం తప్పు.. నేను దానిని సమర్థించటం లేదు.

తెలిసో తెలియకో.. వయసెంత.. ఏం అవగాహన ఉంది.. ఇంటర్ కూడా చదవలేదు. జీవితం మీద ఏం అవగాహన ఉంది.. జగన్ అంటే ఒక పిచ్చి అభిమానం తప్ప అతనికి ఏం తెలియదు. ఒకప్పుడు వైఎస్ఆర్ అంటే అభిమానం. తర్వాత జగన్ అంటే అభిమానం. తమిళనాడులో రాజకీయ నేతను అరెస్టు చేసినప్పుడో, నాయకుడికి దెబ్బ తగిలినప్పుడో.. ఆత్మహుతి చేసుకున్న సందర్భాలు కూడా ఉంటాయి. రాజకీయాల్లో అంతపిచ్చి ఉంటుంది. శ్రీనుకు కూడా అలాంటి పిచ్చే ఉంది. కాకపోతే.. కాస్త తక్కువ స్థాయిలో ఉంది. ఆ పిచ్చి వల్లే పిచ్చి పని చేశాడు. అందుకు శిక్ష కూడా అనుభవించాడు. చిన్న తప్పుకే ఉరి వేస్తారా? ట్రాఫిక్ లైట్ జంప్ చేస్తే జైలులో పెడతారా? తప్పు చేశాడు.. చేసిన తప్పుకు నాలుగు రెట్లు శిక్ష అనుభవించాడు. ఇవాల్టికి స్వేచ్ఛ లేదు. ఎక్కడికైనా వెళ్లి పని చేసుకునే పరిస్థితి లేదు. ఎందుకంటే విచారణ పూర్తి కాలేదు కాబట్టి. పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టాలి.

ఎందుకంటే పిటిషన్ మీద పిటిషన్ వేసి ఆ విచారణను జగన్ జరగనివ్వడం లేదు. ఆయనకెందుకు బాధ? జగన్ నిందితుడిగా ఉన్న సీబీఐ, ఈడీ కేసులు సాగదీస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే అవి రుజువైతే శిక్ష పడుతుంది కాబట్టి. సాక్షిగా ఉన్న కేసులో కూడా విచారణకు రావడానికి ఏమిటి భయం?

ఒక కుటుంబం నాశనం అయిపోతుంది. ఉద్యోగం లేదు. అప్పులు పెరిగిపోతున్నాయి. వడ్డీలు కట్టలేక పోతున్నారు. ఇదీ పరిస్థితి. అందుకే నిన్న అక్కడికి వెళ్లాను. నేను చేయగలిగింది, లాయర్ చేయగలిగింది, స్థానికులు చేయగలిగింది చేస్తాం. అందరం తలో బాధ్యత పంచుకున్నాం. దానికి కూడా కుట్ర అంటున్నారు. కుట్ర చేసే ఆలోచన ఉంటే.. చాటుగా కలుస్తాం కానీ... ఓపెన్‌గా ఎందుకు కలుస్తాం. ఇది వాస్తవం.

**విజిల్: తెలుగు సమాజానికి మీరు ఇచ్చే సందేశం?**

**ఏబీవీ:** విజిల్‌తో పాటు నేను కూడా రాజకీయాల్లోకి ప్రవేశించాను. ఇకపై సమాంతరంగా ప్రయాణం సాగుతుంది. విజిల్ అనే సంస్థ నిజానికి కట్టుబడి ఉంటుంది. నిజాయతీకి కట్టుబడి నిజాలు చెబుతుంది. కాబట్టి ఈ సంస్థను నమ్మొచ్చు. నేను కూడా నిజాయతీగానే పనిచేసిన వాడినే... నిజాయతీగానే నిబద్ధతతోనే రాజకీయాలు చేస్తా.. నన్ను నమ్మినంత కాలం నమ్మండి.. అనుమానం వచ్చిన రోజు నన్ను నమ్మడం మానేయండి.

కానీ.. విజిల్ మీద నా మీద మనలాంటి ఎంతో వందల వేల మంది మీద కీలక బాధ్యత ఉంది. ముఖ్యంగా తెలుగు సమాజాన్ని, ఆంధ్ర సమాజాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. చాలా విషయాల్లో సంస్కరణలు తీసుకురావాలి. ఈ కులాల పిచ్చి, రాజకీయ పిచ్చి నుంచి బయట పడాలి. సాధించగలిగినటువంటి విజయాల గురించి ఆలోచించుకోవాలి. ప్రజలంతా ఇందులో వీలున్నంత వరకు భాగస్వాములు కావాలి. విజిల్‌తో పాటు నాలాంటి వారిని ప్రోత్సహిస్తే... ఇంకా మెరుగ్గా పని చేస్తాం.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 16, ఏప్రిల్ 2025 ||





## వైలెన్స్ పూనకాలే- నాని

నేచురల్ స్టార్ నాని తన అప్ కమింగ్ హిట్: ది 3rd కేస్‌లో మోస్ట్ ఇంటెన్స్ అండ్ వైలెంట్ అవతార్ లో కనిపించనున్నారు. ఈ సినిమా గ్లింప్స్, టీజర్, పాటలు, ఇతర ప్రమోషనల్ కంటెంట్ ట్రెమండస్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో వాల్ పోస్టర్ సినిమా బ్యానర్ పై ప్రశాంతి తిపిర్నేని, నాని యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మించారు. HIT: ది 3rd కేస్ మే 1న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ వైజాగ్ సంగమ్ థియేటర్ లో భారీగా తరలివచ్చిన అభిమానులు సమక్షంలో లాంచ్ చేశారు. అనంతరం హైదరాబాద్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. పొద్దున్న వైజాగ్ లో ట్రైలర్ లాంచ్ చేసాం. ట్రైలర్ రిలీజ్ అయినప్పటి నుంచి నా ఫోన్ మెసేజ్ లతో ఫుల్ అయింది. ట్రైలర్ కి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ ఇది. చాలా ఆనందాన్నిచ్చింది. గత కొన్ని రోజులుగా మా టీమ్ అంతా చాలా కష్టపడ్డారు. ఈ మధ్యకాలంలో లాస్ట్ మినిట్ లో ట్రైలర్స్ ఇస్తున్నారు. ఇంతకుముందు 20 రోజులు ముందు ట్రైలర్ వచ్చేది. ఆ నోస్టాల్జిజియా ఫీలింగ్ మళ్లీ ఇద్దామని ట్రైలర్ ని ముందుగానే రిలీజ్ చేసాము. ట్రైలర్ కోసం టీం అంత డే అండ్ నైట్ పనిచేసింది. ట్రైలర్ కి వస్తున్న రెస్పాన్స్ కారణం శైలేష్ అండ్ టీం. వారందరికీ థాంక్యూ'అన్నారు. డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. ట్రైలర్ చూశారు. యూనిక్ గా క్రియేట్ చేసాము. నాతో కలిసి ఈ సినిమా చేసిన నా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్' అన్నారు.



## అరుంధతి, అమ్మోరు లాంటి
# సినిమా 'ఓదెల 2'

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. సంపత్ నంది సూపర్ విజన్ లో అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి. మధు నిర్మించిన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్. సింహ ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ అంచనాలని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్ళింది. ఈ వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ లలో ఒకటిగా ఏప్రిల్ 17న ఓదెల2 థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు శర్వా చీఫ్ గెస్ట్ గా హాజరైన ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. హీరో శర్వా మాట్లాడుతూ.. కొన్ని కొన్ని సినిమాలు ప్లాన్ చేయాల్సిన అవసరం లేదు. ఆ మంచి వాటంత అదే జరిగిపోతుంది. ఓదెల 2 టీజర్ చూడగానే అరుంధతి, అమ్మోరు సినిమాలు చూసిన ఫీలింగ్ వచ్చింది. ఏదో మ్యాజిక్ జరగబోతుందనే ఫీలింగ్ నాకుంది. సంపత్ నందితో ఏడాదిగా ట్రావెల్ చేస్తున్నాను ఆయన ఒక అడిక్షన్. తమన్నా ఆయనతో నాలుగు సినిమాలు చేశారంటే మామూలు విషయం కాదు. తమన్నాని హీరోయిన్ అని పిలవడం నాకు ఇష్టం లేదు తను వండర్‌ఫుల్ ఆర్టిస్ట్. రెండు దశాబ్దాలుగా హీరోయిన్ గా ఉండడం మామూలు విషయం కాదు. ఒక మాస్ సినిమాకి ఎలా అయితే ఆడియన్స్ వెయిట్ చేస్తారో ఈ సినిమా కోసం ఆడియన్స్ అంతా ఈగర్ గా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ఓపెనింగ్స్ అదిరిపోతాయని ఎందుకో నాకు స్ట్రాంగ్ ఫీలింగ్. కొన్ని సినిమాలుకి ఆడియన్స్ డెఫినెట్‌గా చూడాలని ముందే ఫిక్స్ అయిపోతున్నారు.

ఓదెల 2 కూడా అలాంటి సినిమానే. ఈ సినిమాకి నేను వెళ్తాను. ఆడియన్స్ కూడా వెళ్దామని ఫిక్స్ అయ్యారని నమ్ముతున్నాను. మధుకి టీమ్ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్. ఈ సినిమా టీజర్ చూడగానే నాకు నచ్చింది సౌందర్ రాజన్ విజువల్స్. మంచి సినిమా చేశారు. బ్లాక్ బస్టర్ కొట్టాలి. ఈ సమ్మర్ కి ఇదే బ్లాక్ బస్టర్ అవుతుందని నా నమ్మకం. విష్ యు ఆల్ ది బెస్ట్'అన్నారు.



## ఏప్రిల్ 18న థియేటర్స్‌లో డిఫరెంట్

వండర్ బ్రదర్స్ ఇంటర్నేషనల్ ఫిలిమ్స్ ప్రవేట్ లిమిటెడ్ బ్యానర్ లో జి. ఎన్.నాష్, అజీజ చీమరువ, ప్రట్టీ జో, సన, రోబర్ట్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం లిడిఫరెంట్‌లి. ఎన్.ఎస్.వి.డి శంకరరావు నిర్మాతగా డ్రాగన్ (ఉదయ భాస్కర్) దర్శకత్వంలో లియోన్ ఆర్ భాస్కర్ కెమెరామెన్‌గా చేస్తున్నా ఈ సినిమాకు నిహల్ సంగీతం అందించారు. అందరూ మంచి టెక్నీషియన్స్ వర్క్ చేసిన బెస్ట్ ఫిలిం ఇది.

ఈ సినిమా ట్రైలర్ ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్ చాలా బాగుంది, ఒక సస్పెన్స్ థ్రిల్లర్ జోనల్ లో ఈ సినిమా ఏప్రిల్ 18న థియేటర్స్ లో విడుదల కాబోతోంది. ఇంటర్నేషనల్ స్టాండెడ్స్ తో, సూపర్బ్ విజువల్స్ ఈ మూవీ ఉంటుందని ట్రైలర్ చేస్తుంటే తెలుస్తోంది.

తెలుగు నిర్మాత ఎన్.ఎస్.వి.డి శంకర్రావు చేసిన ఈ హాలీవుడ్ చిత్రం డిఫరెంట్. మంచి సినిమాలు చెయ్యాలనే ఆలోచనతో ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చెయ్యడం జరిగింది.



## ఆసక్తిని పెంచుతున్న శంబాలా మేకింగ్ వీడియో

హీరో ఆది సాయి కుమార్ కెరీర్ డిఫరెంట్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అవుతోంది. ప్రతి సినిమాలో వైవిధ్యం చూపిస్తూ దూసుకుపోతున్న ఈ హీరో ప్రస్తుతం ఆడియెన్స్‌ను నూతన ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా చేస్తున్నారు. ఆ సినిమానే శంబాలా. కాల్పనిక ప్రపంచంలో జరిగే అద్భుతమైన ఘట్టాల్ని చూసి ఆడియెన్స్ థ్రిల్ అవుతున్నారు. ఈ క్రమంలోనే ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లేలా 'శంబాల' చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు ఆది సాయి కుమార్. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాకు 'ఏ-యాడ్ ఇన్ఫినిటిమ్' ఫేమ్ డైరెక్టర్ యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ఖర్చులకు ఎక్కడా రాజీ పడకుండా భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఆది సాయి కుమార్ సరసన అర్చన అయ్యర్ కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుతున్న దర్శకనిర్మాతలు.. ఓ వైపు షూటింగ్ చేస్తూనే మరోవైపు జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇప్పటికే శంబాల మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ మొదలుకొని.. వరుసగా వస్తున్న అన్ని అప్ డేట్స్ సినిమాపై అంచనాలు క్రియేట్ చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా శంబాలా మేకింగ్ వీడియో వదిలారు మేకర్స్. టీజర్ లోడింగ్ అంటూ వదిలిన ఈ వీడియోలో సినిమా కోసం చిత్రయూనిట్ ఏ రేంజ్ లో కష్టపడుతోందో చూపిస్తూ ఆసక్తిరేకెత్తించారు.



## "భరత్ అనే నేను"
# రీ రిలీజ్

రాజకీయాలు ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అన్న సందేశాన్ని ఆవిష్కరిస్తూ, దానికి చక్కటి ఫ్యామిలీ డ్రామా, ప్రేమ, వినోదం వాటి అంశాలను మేళవించి రూపొందించిన "భరత్ అనే నేను" చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో వేరుగా చెప్పనక్కరలేదు. సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా తన పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేయగా, అందాల భామ కైరా అడ్వాణీ జోడీగా నటించింది. కొరటాల శివ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం 2018 ఏప్రిల్ 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. సరిగ్గా ఏడేళ్ల కిందట ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన ఈ చిత్రం ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 19న ఉదయం గం.11-11 నిమి. అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ చేస్తున్నారు. కాగా ఈ రీ రిలీజ్ లో కూడా ఈ చిత్రం అద్భుతమైన ప్రేక్షకుల, అభిమానుల ఆదరణను చూరగొంటుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో ముఖ్యమంత్రి పాత్రలో మహేష్ బాబు తన నటనలోని మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. నేటి రాజకీయ వ్యవస్థ ఎలా ఉంటోంది, ఎలాంటి రాజకీయ నాయకుల వల్ల వ్యవస్థ ఎలాంటి పరిణామాలకు దారితీస్తోంది అన్న అంశాలను అన్ని తరగతుల ప్రేక్షకులకు అర్థమయ్యేలా చూపించారు. సినిమా ఆద్యంతం అందులో లీనమయ్యేలా చేస్తుంది.

## అగ్లీ స్టోరీ నుంచి మరో మెలోడీ

నందు, అవికా గోర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న మూవీ 'అగ్లీ స్టోరీ'. తాజాగా ఈ సినిమా నుంచి 'హే ప్రియతమా' అనే సాంగ్ రిలీజ్ అయ్యింది. ఇక ఈ "హే ప్రియతమా" సాంగ్ ఒక రొమాంటిక్ మెలోడీ. ఇది హృదయాన్ని తాకే ఎమోషన్స్‌తో నిండి ఉంది. శ్రవణ్ భరద్వాజ్ మ్యూజిక్ ఈ పాటకి ఫ్రెష్ ఫీల్ ఇచ్చింది. కాల భైరవ సింగింగ్ స్టైల్, అతని వాయిస్‌లోని డెప్త్ ఈ సాంగ్‌ని మరో లెవెల్‌కి తీసుకెళ్లాయి. భాస్కరభట్ల రాసిన లిరిక్స్ సింపుల్‌గా ఉంటూనే లవ్‌లోని ఎమోషన్స్‌ని పర్ఫెక్ట్‌గా క్యాప్చర్ చేశాయి. "ప్రియతమా" అనే పదం చుట్టూ తిరిగే ఈ లిరిక్స్ యూత్‌కి కనెక్ట్ అవుతాయి. విజువల్స్‌లో శ్రీ సాయికుమార్ దారా సినిమాటోగ్రఫీ అద్భుతం. నందు, అవికా గోర్ జోడీ మధ్య కెమిస్ట్రీ సాంగ్‌కి లైఫ్ ఇచ్చింది. ఈశ్వర్ పెంటి కొరియోగ్రఫీ రొమాంటిక్ మూడ్‌ని మరింత ఎన్‌హాన్స్ చేసింది. రికార్డింగ్ క్వాలిటీ టాప్ నాచ్, ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని విన్నా, స్పీకర్స్‌లో విన్నా సౌండ్ క్లారిటీ సూపర్బ్ గా ఉందనే చెప్పాలి. టోటల్‌గా చెప్పాలంటే, "హే ప్రియతమా" ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ట్రాక్.



ఇక ఈ సినిమాలో శివాజీరాజా, రవితేజ మహదాస్యం, ప్రజ్ఞ లాంటి టాలెంటెడ్ కాస్ట్ నటిస్తున్నారు. రియా జియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జె.ఎస్. సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మించిన ఈ చిత్రానికి రచన, దర్శకత్వం ప్రణవ స్వరూప్ అందించారు.

Published by Bodepudi Venkata Subbarao Managing Director on behalf of Mahanadu Media pvt ltd Editor: Marthi Subrahmanyam Phone: 9705311144